# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2  ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433  E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్  ఆదివారం 9-6-2024  NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026  సంపుటి :30  సంచిక:241  పేజీలు:6  వెల: రూ.1/-


## ప్రధాని ప్రమాణ స్వీకారం నేపథ్యంలో జూన్ 9,10 తేదీలలో 'నో ఫ్లయింగ్ జోన్' గా ఢిల్లీ

న్యూ డిల్లీ జూన్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఢిల్లీని జూన్ 9,10 తేదీలలో 'నో ఫ్లయింగ్ జోన్' గా ప్రకటించారు. ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి వ్యక్తికి తెలుపకుండా సంబంధిత పక్షాలకు తెలిసేలా ఉత్తర్వులు జారీ అయ్యాయి.ప్రధాని నరేంద్ర మోడీ జూన్ 9న పదవీ స్వీకరణ చేపట్టనున్న నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. దేశ రాజధానిని నో ఫ్లయింగ్ జోన్ గా ప్రకటిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సంజయ్ అరోరా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.మోడీ పదవీ స్వీకరణకు మాల్దీవుల అద్యక్షుడు ముయిజ్ హాజరు కానున్నారు. పదవీ స్వీకరణ తర్వాత మోడీ ఇటలీలోని మెలోనిలో జి7 శిఖరాగ్ర సమావేశాలకు వెళ్లనున్నారు. లోక్ సభలో 272 మెజారిటీ సంఖ్యను సాధించనప్పటికీ తెలుగు దేశం, జనతా దళ్(యునైటెడ్) మద్దతుతో ఎన్ డిఏ ప్రభుత్వం కొలువుదీరబోతోంది.

### చురక

బలమైన ప్రతిపక్షం
ప్రజలిచ్చిన నేటి తీర్పు
సర్కారు వక్రగతిని
సరచేసే భారీ మార్పు.

పాత్రోచిత సామర్థ్యం
పరీక్షకు ఇది సమయం
పవర్ పాలిట్రిక్సుల్లో
పాసైతెనె భవిత జయం



-వేల్పుల నారాయణ
9440433475

## రామోజీరావు మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి

### - అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు

హైదరాబాద్ జూన్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఈనాడు గ్రూప్ అధినేత చెరుకూరి రామోజీరావు మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న సిఎం రేవంత్ సోషల్ మీడియా ద్వారా స్పందించారు. "తెలుగు జర్నలిజానికి విశ్వసనీయత, తెలుగు పారిశ్రామిక రంగానికి విలువలు జోడించిన ఘనత ఆయనకే దక్కుతుంది. తెలుగు పత్రికా, మీడియా రంగానికి రామోజీరావు గారు లేని లోటు ఎప్పటికీ పూడ్చలేనిది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థిస్తూ? కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను" అని తెలిపారు.రామోజీరావు అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని సిఎస్ శాంతి కుమారిని సిఎం రేవంత్ ఆదేశించారు. దీంతో అంత్యక్రియలకు సంబంధించిన ఏర్పాట్లు పర్యవేక్షించాల్సిందిగా రంగారెడ్డి కలెక్టర్, సైబరాబాద్ కమిషనర్‌కు సీఎస్ సూచించారు. ఇప్పటికే రామోజీరావు పార్థీవ దేహం ఫిల్మ్ సిటీకి తరలించారు.

## రామోజీరావుకు మంత్రి పొన్నం, స్పీకర్ నివాళి..







హైదరాబాద్, జూన్ 8 :రామోజీ ఫిల్మ్ సిటీలో ఉంచిన రామోజీరావు పార్థివదేహానికి నివాళులర్పించారు మంత్రి పొన్నం ప్రభాకర్ . దివంగత రామోజీరావు భౌతికకాయంపై పుష్ప గుచ్చం ఉంచి అంజలి ఘటించారు.. ఆలాగే స్పీకర్ గడ్డం శ్యాం ప్రసాద్, ఎమ్మెల్యే దానం నాగేందర్, మల్‌రెడ్డి రంగారెడ్డి, మహేష్ కుమార్ గౌడ్ లు కూడా హజరై నివాళులర్పించారు..

కెటిఆర్ అశ్రు నివాళి

తెలుగు పత్రికా రంగం, ప్రసార మాధ్యమాల్లో విప్లవాత్మక మార్పులకు బీజం వేసిన మహనీయుడు రామోజీరావు అని బిఆర్ ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఫిల్మ్‌సిటీలో రామోజీరావు పార్థివదేహానికి ఆయన నివాళులర్పించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ ఈ నష్టం సామాన్యమైనది కాదన్నారు. రామోజీరావు మృతి తెలుగు పత్రికా రంగంతో పాటు ప్రపంచంలోని తెలుగువారందరికీ తీరని లోటు



అని అన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఇక మాజీమంత్రులు హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి లు కూడా రామోజీరావు పార్థివదేహానికి నివాళులర్పించారు.

ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు పార్థివదేహానికి జనసేన అధినేత పవన్ కల్యాణ్ నివాళు లర్పించారు. సినీ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, నిర్మాత రాధాకృష్ణ (చినబాబు) కూడా నివాళులర్పించారు. రామోజీ భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి అంజలి ఘటించారు.


నేటి కందం - నేటికీ అందం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం


ప్రాకటమైన ప్రధానిగ
శ్రీకరుడగు శాస్త్రి వచ్చి చేరుట-నెహ్రూ
యాకస్మిక మరణముతో
శోకించెడి ప్రజకు మంచి సుద్దుగ నిలచెన్
(9-6-1964 శాస్త్రీజీ ప్రధానిగా ప్రమాణం)



-రాధశ్రీ
సెల్:9494481210

## రామోజీరావు మరణం పట్ల ప్రధాని మోడీ తీవ్ర దిగ్భ్రాంతి

న్యూ డిల్లీ జూన్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఈనాడు గ్రూప్ అధినేత చెరుకూరి రామోజీరావు మరణం పట్ల ప్రధాని మోడీ తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. రామోజీరావు కుటుంబ సభ్యులకు మోడీ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మీడియాలో రామోజీ రావు సరికొత్త ప్రమాణాలను నెలకొల్పారని చెప్పారు.రామోజీరావు నుంచి తాను ఎన్నో విషయాలు నేర్చుకున్నాన్నారు. పాత్రికేయ, సినీరంగంపై ఆయన చెరగని ముద్ర వేశారని తెలిపారు. మీడియాను విప్లవాత్మకంగా మార్చిన దార్శనికుడని.. రామోజీరావుతో మాట్లాడే అవకాశం తనకు ఎన్నోసార్లు దక్కిందని మోడీ చెప్పారు. పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు కూడా ఆయన మృతిపై తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.కాగా, హైదరాబాద్ సిటీలోని ఓ ప్రవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజుమున 4.50 నిమిషాలకు రామోజీరావు తుదిశ్వాస విడిచారు.

## ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు అస్తమయం

హైదరాబాద్, జూన్ 8 :ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్ చెరుకూరి రామోజీరావు(88) కన్నుమూశారు. ఈ నెల 5న ఆయనకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవడంతో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చేర్చారు.

అక్కడ చికిత్స పొందుతూ ఆయన శనివారం తెల్లవారుజామున 4.50 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఫిల్మ్‌సిటీలోని నివాసానికి ఆయన పార్థివదేహాన్ని తరలించనున్నారు.

.1936 నవంబర్ 16న కృష్ణా జిల్లా పెదపారుపూడిలో రామోజీరావు జన్మించారు. ఈనాడు దినపత్రికను ప్రారంభించి తెలుగునాట సంచలనం సృష్టించారు. 1974 ఆగస్టు 10న విశాఖ సాగర తీరంలో 'ఈనాడు'ను ప్రారంభించారు. ప్రారంభించిన నాలుగేళ్లలోనే పాఠకుల మానసపుత్రికగా ఈనాడు మారింది. ఈనాడుతో పాటు కీలక మైలురాయిగా 'సితార' సినీ పత్రిక నిలిచింది.బహుముఖ



ప్రజ్ఞ.. కఠోర సాధన.. ఇదే రామోజీ అస్త్రాలు. నలుగురు నడిచిన బాట కాదు.. కొత్త దారులు సృష్టించడం ఆయన నైజం. లక్ష్య సాధనకు దశాబ్దాలపాటు నిర్విరామంగా పరిశ్రమించిన యోధుడు. రైతుబిడ్డగా మొదలై వ్యాపారవేత్తగా రాణించారు. మీడియా మహాసామ్రాజ్యాన్ని నిర్మించిన రామోజీరావు.. చైతన్యదీపుల్లాంటి చిత్రరాజాలను సృజించారు. అద్భుత ఫిల్మ్‌సిటీని సృష్టించారు. తెలుగువారి హృదయాల్లో చెరగని ముద్ర వేశారు. ఆఖరి క్షణం వరకూ ప్రజా శ్రేయస్సు కోసమే పరితపించారు. పనిలోనే విశ్రాంతి అనేది ఆయన ప్రాథమిక సూత్రం. చివరి క్షణం వరకు పనిలోనే విశ్రాంతి సిద్ధాంతాన్ని పాటించిన మహనీయుడు.

## రామోజీరావు మృతికి కెసిఆర్ సంతాపం

హైదరాబాద్, జూన్ 8 :ఈనాడు గ్రూప్ ఛైర్మన్ రామోజీ రావు మృతిపట్ల బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం తెలిపారు. పలు రంగాల్లో వ్యాపారవేత్తగా, మీడియా సంస్థల వ్యవస్థాపకుడిగా ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. శోకతప్తులైన రామోజీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.కాగా, రామోజీ రావు మరణం తీవ్రదిగ్భ్రాంతి కలిగించిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. స్వయం కృషితో ఎదిగిన గొప్ప దార్శనికుడని చెప్పారు. ఆయన జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు.ఇక రామోజీ మృతి పట్ల సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు సంతాపం తెలిపారు. సాధారణ వ్యక్తిగా ప్రారంభమైన ఆయన జీవితం నేడు అందరికీ ఆదర్శమని చెప్పారు. తెలుగువాడి సత్తాను యావత్ ప్రపంచానికి చాటిచెప్పారని వెల్లడించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ.. సీడబ్ల్యూసీ తీర్మానం

న్యూఢిల్లీ జూన్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీని ఎన్నుకునేందుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) ఒక తీర్మానాన్ని ఆమోదించింది. దీనికి రాహుల్ గాంధీ అంగీకరించవచ్చని కాంగ్రెస్ పార్టీ నేతలు పేర్కొన్నారు. త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటానని ఆయన చెప్పారన్నారు. శనివారం ఢిల్లీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) విస్తృత సమావేశం జరిగింది. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మనీష్ తివారీ, డీకే శివకుమార్, రేవంత్ రెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీని నియమించాలని సీడబ్ల్యూసీ తీర్మానం చేసింది. కాగా, సీడబ్ల్యూసీ సమావేశం తర్వాత కాంగ్రెస్ పార్టీ నేతలు మీడియాతో మాట్లాడారు.

రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేత కావాలని కాంగ్రెస్ నేతలంతా గట్టిగా కోరుతున్నారని ఆ పార్టీ నేత కేసీ వేణుగోపాల్ తెలిపారు. ఇది వర్కింగ్ కమిటీ అభ్యర్థన అని చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ, కేరళలోని వాయనాడ్‌ల నుంచి లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించిన రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారంలో చేసిన కృషిని కూడా సీడబ్ల్యూసీ తీర్మానం కొనియాడిందని అన్నారు.

## రామోజీ రావు మరణం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దిగ్భ్రాంతి

న్యూ డిల్లీ జూన్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఈనాడు సంస్థల అధినేత రామోజీ రావు మరణం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ముగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ మేరకు ప్రముఖ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సంతాపం ప్రకటించారు. రామోజీరావు మృతితో దేశం ఓ మీడియా దిగ్గజాన్ని కోల్పోయిందన్నారు.'రామోజీ మరణంతో మీడియా, వినోద రంగం ఓ టైటాన్‌ను కోల్పోయింది. రామోజీరావు ఓ వినూత్న వ్యాపారవేత్త. ఈనాడు వార్తా పత్రిక, ఈటీవీ న్యూస్ నెట్‌వర్క్, రామోజీ ఫిల్మ్ సిటీ సహా అనేక సంస్థలను స్థాపించి ఎంతో మందికి ఉపాధి కల్పించారు. తన దూరదృష్టితో ఎన్నో విజయాలు సాధించి సమాజంలో చెరగని ముద్రవేశారు. మీడియా, సినీ పరిశ్రమలకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయం. పద్మవిభూషణ్ అందుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు నా ప్రగాఢ సానుభూతి' అని రాష్ట్రపతి ముర్ము తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

## రామోజీరావుకు చంద్రబాబు కన్నీటి నివాళి

హైదరాబాద్, జూన్ 8 :రామోజీ గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు పార్థివదేహం వద్ద టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, ఆయన సతీమణి భువనేశ్వరి కన్నీటి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ రామోజీ రావు మరణవార్త జీర్ణించుకోలేక పోతున్నానని చంద్రబాబు తెలిపారు. రామోజీరావు మరణం చాలా బాధాకరమన్నారు. సమాజహితం కోసం ఆయన అహర్నిశలు పాటు పడ్డారని తెలిపారు. రామోజీరావు ఒక వ్యక్తికాదని, వ్యవస్థ అని కొనియాడారు.

సినీ ఇండస్ట్రీకి రామోజీరావు ఎనలేని కృషి చేశారని, ధర్మం కోసమే పని చేస్తానని చాలా సందర్భాల్లో తనకు చెప్పారని చంద్రబాబు గుర్తు చేశారు. రామోజీరావు నిర్మించిన వ్యవస్థలు శాశ్వతంగా ఉండిపోతాయని తెలిపారు. ఎన్నో ప్రమాణాలతో రామోజీ ఫిల్మ్ సిటీని స్థాపించారని చంద్రబాబు చెప్పారు. తన జీవితకాలంలో రామోజీరావు విశ్వసనీయత సంపాదించుకున్నారని, తెలుగు జాతికి ముందుకు తీసుకెళ్లేందుకు చాలా కృషి చేశారని తెలిపారు. ఏపీ అభివృద్ధి విషయంలో రామోజీరావు ఇచ్చిన



స్ఫూర్తితో ముందుకెళ్తామని చంద్రబాబు పేర్కొన్నారు.

### రామోజీరావు కుటుంబసభ్యులను ఓదార్చిన చంద్రబాబు..

ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు మరణించిన విషయం తెలిసిందే. దీంతో ఆయన పార్థీవదహాన్ని రామోజీ ఫిల్మ్‌సిటీలో ఉంచారు. రామోజీరావు మరణ వార్త విన్న చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి రామోజీ రావు పార్థివదేహానికి నివాళు లర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. రామోజీరావు మరణం చాలా బాధాకరమని చంద్రబాబు తెలిపారు.

## చేపమందు ప్రసాదం పంపిణీ .. నాంపల్లిలో పోటెత్తిన జనం

హైదరాబాద్, జూన్ 8 :హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శనివారం ఉదయం చేపమందు ప్రసాదం పంఫిణి ప్రారంభమైంది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్పీకర్ గడ్డం శ్యాం ప్రసాద్, దానం నాగేందర్, ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్, మేయర్ గద్వాల విజయలక్ష్మి లతో కలిసి కార్యక్రమాన్ని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్లో ప్రారంభించారు.

ముందుగా చేప ప్రసాద పంపిణీ చేప ప్రసాదాన్ని దివంగత బత్తిన హరినాథ్ గౌడ్ కుమారుడు అమర్నాథ్ గౌడ్, సోదరుడు గౌరీ శంకర్లు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు చేప మందును వేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మృగశిర కార్తె సందర్భంగా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో బత్తిని కుటుంబ సభ్యుల



ఆధ్వర్యంలో 150 సంవత్సరాలుగా చేప మందు పంపిణీ జరుగుతుందన్నారు. చాలా కాలంగా చేప మందు పంపిణీ విశ్వాసంతో ప్రజలు వేసుకుంటున్నారని తెలిపారు. అస్తమా, శ్వాస సంబంధిత వ్యాధిగ్రస్తులు ఈ ఫిష్ మెడిసిన్ వేసుకుంటారని, వివిధ దేశాలు, ఇతర రాష్ట్రాల నుండి కూడా ఈ చేప ప్రసాదం కోసం ప్రజలు వస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేప ప్రసాదం కోసం చేపలు ఏర్పాటు చేయడంతో పాటు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమం రేపటి వరకు కొనసాగనుంది.


ఆహ్వానం

కిన్నెర ఆర్ట్ థియేటర్స్
ద్వానా సాహితీ కుటీరం
సంయుక్త ఆధ్వర్యంలో





సాహిత్య సవ్యసాచి, విమర్శన కళాప్రవీణ
డా॥ ద్వానా శాస్త్రి గారి
77వ జయంతి సందర్భంగా

ప్రముఖ రచయిత, సంపాదకులు
శ్రీ జి. వల్లీశ్వర్ గారికి
కిన్నెర-ద్వానాశాస్త్రి స్మారక
పురస్కారం-బహూకరణ

శనివారం 15-06-2024, సా॥ 6 గంటలకు
రవీంద్రభారతి సమావేశ మందిరం,
మొదటి అంతస్తు, హైదరాబాదు

ముఖ్యఅతిథి : డా॥ కె.వి.రమణ, ఐఎఎస్ (రి)
పూర్వ సలహాదారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ

అధ్యక్షులు : డా॥ ఏనుగు నరసింహా రెడ్డి, ప్రముఖ కవి, విమర్శకులు

విశిష్ట అతిథి : డా॥ వోలేటి పార్వతీశం, ప్రముఖ సాహితీవేత్త

గౌరవ అతిథి : శ్రీ బైస దేవదాసు, నేటినిజం సంపాదకులు

ఆత్మీయ అతిథులు : హాస్యబ్రహ్మ శ్రీ శంకర నారాయణ, ప్రముఖ రచయిత
శ్రీ ద్వాదశి శశికాంత్, ద్వానా శాస్త్రి కుమారుడు

డా॥ ఆర్. ప్రభాకరరావు, ఐ.పి.ఎస్. (రి)
అధ్యక్షులు

మద్దాళి రఘురామ్
కార్యదర్శి

# భారతంలో పేదరికం తగ్గుతూ నిరుద్యోగం పెరుగుతోందా?!

అత్యధిక ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశాల జాబితాలో 5వ స్థానంలో ఉన్న భారతం రానున్న రోజుల్లో జర్మనీ, జపాన్‌ను అధిగమించి 3వ స్థానానికి చేరనుందనే అంచనాలు వేస్తున్నారు. అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన యూఎస్, చైనా తర్వాత మూడవ స్థానానికి భారత్ ఎగబాకనుంది. నేడు యువ భారతమనే గ్లాసు సగం నిండుగా, సగం ఖాళీగా ఉన్నట్లు తోస్తున్నది. ఒక వైపు ఆర్థిక ప్రగతి పరుగులు పెడుతూ మరో వైపు నిరుద్యోగం పెరుగుతోంది. ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి పథంలో పరుగిడుతున్న డిజిటల్ యుగాన భారత గ్రాడ్యుయేట్లలో నిరుద్యోగ సమస్య అధికంగా నమోదు అవుతున్నది. యువ భారత నిరుద్యోగం 10 శాతం ఉన్నప్పటికీ డిగ్రీ పట్టాలు పొందిన యువత నిరుద్యోగం 29 శాతంగా నమోదు కావడం సోచనీయం. మరో దారి లేని నిరుద్యోగ యువత విదేశీ వార్-జోన్‌లో సహితం పని చేయడానికి వెనకాడటం లేదు.

తగ్గుముఖం పడుతున్న పేదరికం, పెరుగుతున్న అసమానతలు:

గత రెండు దశాబ్దాలుగా ఆర్థిక ప్రగతి వేగం పెరిగి పేదరికం గణనీయంగా తగ్గుతున్నది. 2004 – 12 మధ్య కాలంలో 140 మిలియన్ల భారతీయులు పేదరికం నుంచి బయట పడినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2013 – 14లో 29.17 శాతం ఉన్న బహుమితీయ పేదరికం (మల్టీడైమెన్షనల్ పావర్టీ) 2022 – 23 నాటికి 11.28 శాతానికి తగ్గడంతో దాదాపు 250 మిలియన్ల పేదలు పేదరిక కోరల్లోంచి బయట పడ్డట్లు నీతి ఆయోగ్ తెలుపుతున్నది. గత నాలుగు దశాబ్దాల్లో 10 శాతం అత్యంత ధనవంతుల ఆదాయం రెట్టింపు అవుతూ 60 శాతం వరకు పెర్గగా, 50 శాతం అట్టడుగు పేదల ఆదాయం 15 శాతం వరకు మాత్రమే పెరుగుదల నమోదు అయ్యింది. ఒక శాతం అత్యంత ధనవంతుల ఆదాయం 22.6 శాతంగా కనిపిస్తూ ఆర్థిక అసమానతలు క్రమంగా పెరగడం గమనిస్తున్నాం. నాణ్యమైన విద్య కొరవడడం, నైపుణ్యాల కొరత పెరగడంతో ఆర్థిక ఆదాయ అసమానతలు క్రమంగా పెరుగుతున్నాయి.

వ్యవసాయ రంగం నుంచి వ్యవసాయేతర రంగాల వైపు యువత చూపులు:

నేషనల్ సాంపుల్ సర్వే సంస్థ గణాంకాల ప్రకారం వ్యవసాయధార వృత్తుల్లో 45.5 శాతం, నిర్మాణరంగంలో 12.4 శాతం, మాన్యుఫాక్చరింగ్ రంగంలో 11,6 శాతం శ్రామికులు (వర్క్ ఫోర్స్) పని చేస్తున్నట్లు స్పష్టం అవుతున్నది. వ్యవసాయ రంగ శ్రామికులను అధిక ఆదాయ ఉద్యోగ ఉపాధుల వైపు పని కల్పించి ఆకర్షించడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నట్లు తోస్తున్నది. సేవారంగం 29 శాతం వరకు ఉద్యోగాలను కల్పిస్తున్నది. ప్రపంచ బ్యాంకు, ప్రపంచ ద్రవ్య నిధి అంచనాల ప్రకారం 2024-25లో భారత్ 6.6 – 6.8 శాతం ప్రగతిని సాధించనుంది. 2002లో నిర్ణయించిన ప్రకారం ప్రతి ఏట 10 మిలియన్ల ఉద్యోగాలు కలిపించాల్సి ఉండగా ఆ లక్ష్యాలకు దూరంగా నిరుద్యోగం క్రమంగా పెరుగుతూనే ఉన్నది. 2024లో ప్రతి ఏట 20 మిలియన్ల ఉద్యోగాలు కల్పించాల్సి ఉంది. గ్రామీణ యువత వ్యవసాయ రంగంలో పని చేయడానికి విముఖంగా ఉంటూ వ్యవసాయేతర ఉద్యోగ ఉపాధులకు విదేశాలకు, పట్టణాలకు వలసలు వెళ్లడం చూస్తున్నాం.

ఉద్యోగ ఉపాధుల కల్పనకు ప్రభుత్వ ప్రయత్నాలు:

మే 2023లో జరిగిన ఒప్పందం ప్రకారం 42,000 నిర్మాణ రంగం, నర్సింగ్ నైపుణ్య యువతకు రణరంగమైన ఇజ్రాయెల్ ప్రభుత్వం ఉద్యోగాలు కల్పిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'అగ్నిపథ్ పథకం' ద్వారా యువతకు రక్షణ రంగంలో ఉద్యోగాలను కల్పిస్తున్నది. భారత యువత చేస్తున్న ఉద్యోగాల్లో 90 శాతం వరకు అనధికారిక, అసంఘటిత రంగాల్లో నమోదు అవుతున్నారు. 'మేకిన్ ఇండియా', ఆత్మనిర్భర్ భారత్, రోజ్‌గార్ యోజన, గ్రామీణ ఉపాధి హామీ, నేషనల్ కెరీర్ సర్వీస్, గరీబ్ కళ్యాణ యోజన, గ్రామీణ/పట్టణ జీవనోపాధి మిషన్, గ్రామీణ కౌషల్య యోజన, స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, ముద్ర యోజన, కౌషల్ వికాస్ యోజన లాంటి పలు పథకాలు యువ భారతానికి ఉద్యోగ ఉపాధుల ఊరటను ఇస్తున్నాయి.

భారతీయుల సగటు వయస్సు దాదాపు 28 – 29 ఏండ్ల మాత్రమే ఉన్నందున భారత యువ జనాభా దాదాపు 50 శాతం దాటి ఉన్నది. అనేక ఇతర దేశాల్లో యువ జనాభా తగ్గుతూ వృద్ధుల జనాభా పెరుగుతోంది. మనదైన యువ మానవ వనరులను సక్రమంగా వినియోగించుకున్నపుడు 'యువ భారతం' రానున్న రోజుల్లో 'నైపుణ్య భారతం'గా మారి దేశాభివృద్ధికి పునాదులు వేసి 'సంపన్న భారతం'గా మారనుందనడంలో అతిశయోక్తి లేదు.

డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# ఐపిఇఎఫ్ క్లీన్ ఇకానమి ఇన్ వెస్టర్ ఫోరమ్ లో భారతదేశం యొక్క అవకాశాలను చాటిచెప్పడమైంది

న్యూఢిల్లీ, జూన్ 8 :భారత దేశం లో గల పెట్టుబడి అవకాశాల ను చాటిచెప్పడం కోసమని వాణిజ్య విభాగం మరియు ఇన్వెస్ట్ ఇండియా లు ఇండో-పసిఫిక్ ఇకానమిక్ ఫ్రేమ్ వర్క్ ఫార్ ప్రాస్పెరిటీ (ఐపిఇఎఫ్) క్లిన్ ఇకానమి ఇన్ వెస్టర్ ఫోరమ్ యొక్క ప్రారంభిక సమావేశం సందర్భం లో ఒక సమావేశాన్ని నిర్వహించాయి.

ఈ సందర్భం లో వాణిజ్య విభాగం కార్యదర్శి శ్రీ సునీల్ బరథ్‌వాల్ ప్రారంభోపన్యాసాన్ని ఇస్తూ, బజారు ప్రధానమైన ఆర్థిక వ్యవస్థలు గా క్రొత్త గా ఉనికి లోకి వస్తున్న దేశాల తో పోలిస్తే భారత దేశం యొక్క వృద్ధి రేటు ఏ విధం గా దాదాపు గా రెండింతలు గా ఉన్నదీ నొక్కి చెప్పారు. ఈ బలమైన వృద్ధి ఇది వరకు మూలధన లభ్యత మరియు పన్నుల సంబంధి ప్రయోజనాల కోసం విదేశాల కు తరలి వెళ్ళినటువంటి భారతదేశం స్టార్ట్-అప్స్ ప్రస్తుతంలో స్వదేశాని కి తిరిగి వస్తున్నటువంటి ఒక 'రివర్స్ ఫ్లిపింగ్' సరళి కి సైతం దారితీస్తున్నదని ఆయన వ్యాఖ్యానించారు. ఇవాళ డిజిటల్ ఇకానమి తో పాటు గా ఆర్టిఫిశల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) వంటి సరిక్రొత్తగా ఉనికి లోకి వస్తున్నటు వంటి సాంకేతికత లు మరియు డేటా సెంటర్ ల సంఖ్య లో వృద్ధి రాబోయే కాలం లో భారతదేశం యొక్క వృద్ధి లో ఏ విధం గా కీలకం కానున్నాయి అని ఆయన స్పష్టం చేశారు.

సింగపూర్ లోని మరీనా బే సేండ్స్ లో నిర్వహించిన ఈ సమావేశం లో భారతదేశాని కి చెందిన ప్రైవేటు రంగం మరియు ప్రభుత్వ అధికారుల తో పాటుగా, యుఎస్, సింగపూర్, జాపాన్, ఆస్ట్రేలియా, కొరియా తదితర దేశాల నుండి విచ్చేసిన గ్లోబల్ ఇన్ వెస్టర్స్ సహా అరవై మంది కి పైగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో టెమాసెక్, గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పార్ట్‌నర్స్, గారంట్‌కో, ప్రైవేట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డివెలప్‌మెంట్ గ్రూప్ (పిఐడిజి), గోల్డ్‌మన్ సేక్స్, ఐ స్క్వేయర్డ్ కేపిటల్, మిజుహో బేంక్ లిమిటెడ్, ఎడ్ వాంటేజ్ పార్ట్‌నర్స్, నోమురా, డిబిఎస్ బేంక్, ఇంకా సిటీ బేంక్ ల వంటి ఐపిఇఎఫ్ సభ్యత్వ దేశాల కు చెందిన ఇన్ వెస్టర్ లతో పాటు ఆర్థిక సహాయ సంస్థలు పాలుపంచుకొన్నాయి. భారతదేశాని కి చెందిన మౌలిక సదుపాయాల రంగం మరియు జలవాయు రంగం తో ముడిపడ్డ వ్యాపార సంస్థ లు వాటి యొక్క పరిష్కారాల ను ఈ సందర్భం గా ప్రదర్శించాయి; అవి ప్రపంచ బజారుల లో ప్రవేశించడం కోసం అంతర్జాతీయ ఇన్ వెస్టర్ లతో మాటామంతీ జరిపాయి.

సింగపూర్ లో భారతీయ కమిశనర్ డాక్టర్ శ్రీ శిల్పక్ అంబులె ఈ కార్యక్రమం లో మాట్లాడుతూ, భారతదేశం లో వృద్ధి కి దన్ను గా నిలుస్తున్న మౌలిక అంశాల ను గురించి వివరించారు. భౌతికమైనటు వంటి మరియు డిజిటల్ మాధ్యమం లోని మౌలిక సదుపాయాల కల్పన పై పెట్టే పెట్టుబడి ప్రభావం భారతదేశ ఆర్థిక వ్యవస్థ పై అనేక విధాలు గా ఉంటుందని, మరి శాసన సంబంధమైనటువంటి, ఇంకా నియంత్రణ పరమైనటువంటి మార్పు లు బజారు కు అనుకూలమైన అవకాశాల ను కల్పించి, విధానాల కు సంబంధించిన సానుకూలమై నటువంటి మరియు భవిష్యత్తు లో ఏ రకమైన చర్య లు తెర మీదకు వచ్చేదీ ఊహించగలిగిన అటువంటి వాతావరణాన్ని ఏర్పరుస్తున్నాయని ఆయన వివరించారు. ప్రపంచవ్యాప్తం గా సప్లయ్ చైన్ లో చోటు చేసుకొంటున్న పరివర్తన మరియు మౌలిక సదుపాయాల కల్పన సంబంధి ఆధునీకరణ దిశ లో భారతదేశం చేపడుతున్న టువంటి చర్య లు భారతదేశాని కి చక్కటి అవకాశాల ను ఏ విధం గా కల్పించను న్నాయో ఆయన ప్రముఖం గా ప్రకటించారు.

దీని తరువాత ఘట్టం లో భాగం గా భారతదేశం లోని అవకాశాలను గురించిన ఒక ప్రత్యేక సన్నివేశాన్ని ఆవిష్కరించడమైంది. ఇన్ వెస్ట్ ఇండియా ప్రభుత్వ వివిధ ప్రధాన కార్యక్రమాల ను గురించి ఒక వివరణ చిత్రాన్ని ప్రదర్శించింది. ఇందులో భారతదేశం లో స్టార్ట్-అప్ ఇకోసిస్టమ్ వర్ధిల్లుతూ ఉండడం, నైపుణ్యం కలిగిన మరియు ప్రతిభావంతులైన వృత్తి కుశలురతో కూడిన ఒక పెద్ద సమూహం వివిధ పరిశ్రమల కు అందుబాటు లో ఉండడం, మౌలిక సదుపాయాల కల్పన ప్రధానమైన ప్రాజెక్టుల లో పెట్టుబడుల కు ప్రోత్సాహం, నియంత్రణల ను ఒక గాడిన పెట్టేందుకు ఉద్దేశించినటువంటి విధానపరమైన సంస్కరణ చర్య లు, పారదర్శకత్వాన్ని పెంపొందించడం లతో పాటు "వ్యాపార నిర్వహణ లో సౌలభ్యం" పైన శ్రద్ధ వహించడం వంటి వాటిని గురించి వివరించడమైంది.

ఇన్ వెస్ట్ ఇండియా యొక్క ఎమ్‌డి మరియు సిఇఒ నివృతి రాయ్ గారు మాట్లాడుతూ, భారతదేశం నెట్ జీరో లక్ష్యాల ను సాధించడానికి బలమైనటు వంటి మౌలిక సదుపాయాల కల్పన, జలవాయు సాంకేతిక పరిజ్ఞా?నం మరియు నవీకరణ యోగ్య శక్తి సంబంధి ప్రాజెక్టుల లో ముందంజ వేయడం కోసం ఇన్ వెస్టర్ లతోను, క్లీన్ ఇకానమి సంస్థల తోను మరియు వినూత్నమైనటువంటి స్టార్ట్-అప్స్ తోను కలసి పనిచేయడానికి ఆసక్తి ని కనబరుస్తోందన్నారు.

"చార్టింగ్ ఇండియా ఆపర్చ్యునిటీ" శీర్షిక తో జరిగిన ఒక సంభాషణ లో సీనియర్ ఆర్థికవేత్త మరియు కార్యనిర్వాహక సంచాల కురాలు రాధిక రావు గారు పాల్గొం టూ, భారతదేశం యొక్క శక్తి 'నాలుగు సి' (4అ) లలో ఇమిడివుందన్నారు. ఆ 'నాలుగు సి' లు ఏవేవి అంటే వాటిలో కన్‌సిస్టెన్సీ ఒ కంటిన్యుయిటీ ఇన్ పాలిసీ (విధానాల పరం గాను, సంస్కరణలోను స్థిరత్వం); ఇంక్రీజింగ్ కేపెక్స్ (ప్రభుత్వం ద్వారాను, వినియోగం మాధ్యం ద్వారాను మరియు ప్రయివేటు రంగం ద్వారాను మూలధన నిధుల ను పెంచడం) ; తయారీ రంగాల ను ఆకట్టుకొనే తరహా లో వ్యాపారాల కూర్పు; రాబోయే 5 సంవత్సరాల లో వినియోగం పరం గా వృద్ధి అనేవే అని ఆమె చెప్పారు.

నోమురా ఇండియా నివేదిక ను గురించి ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సోనల్ వర్మ గారు విపులం గా మాట్లాడారు. "బాటమ్స్ అప్" పేరు తో నిర్వహించిన ఒక అధ్యయనం లో అత్యధిక వ్యాపార సంస్థ లు మరే ఇతర భూభాగం కంటే కూడా భారతదేశానికేసే ఆశ గా చూస్తున్నాయని తేలింది. "బాటమ్స్ అప్" అధ్యయనం లో భాగం గా దాదాపు గా 130 కంపెనీలు వాటి వాటి పెట్టుబడుల ను ఏ దేశం లో, ఏ ఏ రంగాల లో పెట్టాయో తెలుసుకోవ దానికి ఒక సర్వేక్షణ ను నిర్వహించడమైంది. భారతదేశం సెమికండక్టర్ అసెంబ్లి మొదలుకొని టెస్టింగ్ వరకు, ఆటోమొబైల్స్ మొదలుకొని కేపిటల్ గూడ్స్ వరకు చూస్తే అనేక రంగాల లో పెట్టుబడుల ను ఆకర్షిస్తున్నది.

ఐ స్క్వేయర్డ్ యొక్క మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ కునాల్ అగ్రవాల్ మాట్లాడుతూ, భారతదేశం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డిజిటల్ క్రాంతి సంబంధి రంగం లో ఒక మెరుగైనటువంటి దశ గుండా పయనిస్తోందన్నారు. భారతదేశాన్ని ఒక భేదభావాలకు తావు ఉండని అటువంటి పెట్టుబడి నిలయం గా పరిగణించడం జరుగుతోంది అని ఆయన అన్నారు.

ఇదే కార్యక్రమం లో పాలుపంచుకొన్న పరిశ్రమ రంగ సభ్యులు ఇండో-పసిఫిక్ రీజన్ లో ఆర్థిక విషయాల పరం గా సహకారాన్ని ప్రోత్సహించే దిశ లో ఈ ప్రారంభిక కార్యక్రమం చెప్పుకోదగిన ముందంజ అని చెప్పవచ్చన్నారు. పరిశ్రమ లు అవి ఎదుర్కొంటున్న సవాళ్ళ ను పరిష్కరించుకోవడం కోసం మరియు వృద్ధి ని సాధించడం కోసం క్రొత్త క్రొత్త అవకాశాల ను సృష్టించడానికి కలిసికట్టు గా కృషి చేసేందుకు ప్రాధాన్యాన్ని ఇవ్వాలి అని వారు నొక్కి పలికారు. క్లీన్ ఇకానమి మరియు సప్లయ్ చైన్ వ్యవస్థ ల పరంగా ఆటుపోటుల ను తట్టుకొని నిలబడగలిగే వాతావరణం యొక్క కల్పన ఎంతో కీలకం అని కూడా ఫోరమ్ స్పష్టం చేసింది.

ది ఇండో-పసిఫిక్ ఇకానామిక్ ఫ్రేమ్ వర్క్ ఫార్ ప్రాస్పెరిటీ (ఐపిఇఎఫ్ ) ను 2022 మే మాసం లో ప్రారంభించడమైంది. ప్రస్తుతం దీనిలో 14 దేశాల కు భాగస్వామ్యం ఉంది. ఆయా దేశాల లో ఆస్ట్రేలియా, బ్రునేయి దారుస్సలామ్, ఫిజీ, భారతదేశం, ఇండొనేశియా, జాపాన్, కొరియా గణతంత్రం, మలేశియా, న్యూజీలేండ్, ఫిలీపీన్స్, సింగపూర్, థాయిలాండ్, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా మరియు వియత్‌నామ్ లు ఉన్నాయి. ఐపిఇఎఫ్ లో సహకారం తాలూకు నాలుగు మూల స్తంభాలు ఉన్నాయి. అవి ఏవేవి అంటే వాటి లో వ్యాపారం, సప్లయ్ చైన్, క్లీన్ ఇకానమి మరియు ఫేర్ ఇకానమి లు. ఐపిఇఎఫ్ ఈ ప్రాంతం లోని దేశాల కు ఆటుపోటుల ను తట్టుకొని నిలబడగలిగేటటువంటి, స్థిరత్వం తో కూడినటువంటి మరియు సమ్మిళిత ఆర్థిక వృద్ధి ని ముందుకు తీసుకుపోయేటటువంటి సహకారాన్ని అందించడం కోసమంటూ ఒక వేదిక ను సమకూర్చుతోంది. దీని ఉద్దేశ్యమల్లా ఈ ప్రాంతం లో సహకారం, స్థిరత్వం మరియు సమృద్ధి లకు తోడ్పాటు ను ఇవ్వాలనేదే.

ఐపిఇఎఫ్ యొక్క కార్యక్రమాల లో ఒకటి గా ఉన్నటువంటి ఐపిఇఎఫ్ క్లీన్ ఇకానమి ఇన్ వెస్టర్ ఫోరమ్ దీర్ఘ కాలిక మౌలిక సదుపాయాల కల్పన, జలవాయు సాంకేతిక పరిజ్ఞనం మరి యు నవీకరణ యోగ్య శక్తి సంబంధి ప్రాజెక్టుల కై పెట్టుబడి ని సమీకరించడం కోసం ఈ ప్రాంతం లోని అగ్రగామి ఇన్ వెస్టర్ లను, పరోపకారి సంస్థలకు, ఆర్థిక సహాయ సంస్థలకు, వినూత్న వ్యాపార సంస్థలకు, స్టార్ట్-అప్స్ కు మరియు నవ పారిశ్రామిక వేత్తల కు ఒక వేదిక ను సమకూర్చింది.

# శ్రీ రామోజీరావు మృతికి సంతాపం తెలిపిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జూన్ 8 :రామోజీ ఫిల్మ్ సిటీ వ్యవస్థాపకులు శ్రీ రామోజీరావు మృతిపట్ల ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

భారతీయ మీడియాలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిన ఒక దార్శనికుడు రామోజీరావు అని మోదీ కొనియాడారు. ఆయన సేవలు సినీ,పత్రికా రంగాలలో చెరగని ముద్ర వేశాయన్నారు.

ప్రధాన మంత్రి ఎక్స్ మాధ్యమం లో ఈ క్రింది విధం గా పేర్కొన్నారు :"శ్రీ రామోజీ రావుగారి మరణం ఎంతో బాధాకరం.ఆయన భారతీయ మీడియాలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిన ఒక దార్శనికుడు.ఆయన సేవలు సినీ, పత్రికా రంగాలలో చెరగని ముద్ర వేశాయి. తన అవిరళ కృషి ద్వారా, ఆయన మీడియా, వినోద ప్రపంచాలలో శ్రేష్ఠమైన ఆవిష్కరణలకు నూతన ప్రమాణాలను నెలకొల్పారు.

రామోజీ రావు గారు భారతదేశ అభివృద్ధి పట్ల చాలా ఉత్సాహం చూపే వారు. ఆయనతో సంభాషించడానికి, ఆయన అపారమైన జ్ఞానాన్నుంచి లబ్ధి పొందేందుకు అనేక అవకాశాలు పొందడం నా అదృష్టం. ఈ దుఃఖ సమయంలో అతని కుటుంబ సభ్యులకు, స్నేహితులకు అసంఖ్యాక అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఓం శాంతి."

# శ్రీవారిని దర్శించుకున్న ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే వివేక్



తిరుపతి, జూన్ 8 :తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామిని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. శనివారం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, చెన్నూరు శాసనసభ్యులు వివేక్ వెంకటస్వామితో కలిసి కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అధికారులు, అర్చకులు ఎంపీ, ఎమ్మెల్యేకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందించడంతో పాటు వేద ఆశీర్వాదం అందజేశారు.

# ఇఎస్ఐసి డైరెక్టర్ జనరల్ గా పదవీ బాధ్యతలను స్వీకరించిన శ్రీ కమల్ కిశోర్ సోన్

న్యూఢిల్లీ, జూన్ 8 :శ్రమ మరియు ఉపాధి ల మంత్రిత్వ శాఖ ఆధీనం లోని ఎంప్లాయీస్ స్టేట్ ఇన్ శూరన్స్ కార్ పొరేశన్ (ఇఎస్ఐసి) కి డైరెక్టర్ జనరల్ గా అదనపు బాధ్యత ను శ్రీ కమల్ కిశోర్ సోన్ 2024 మే నెల 31 వ తేదీ నాడు స్వీకరించారు. ఆయన ఝార్ ఖండ్ కేడర్ (బ్యాచ్: 1998) కు చెందిన సీనియర్ ఐఎఎస్ అధికారి. ప్రస్తుతం శ్రమ ఉ ఉపాధి ల మంత్రిత్వ శాఖ లో అడిశనల్ సెక్రట్రి గాను, డైరెక్టర్ జనరల్ గాను విధుల ను నిర్వహిస్తున్నారు. శ్రీ కమల్ కిశోర్ సోన్ కు ఝార్ ఖండ్ రాష్ట్రం లో వివిధ విభాగాల యొక్క పాలన లోను మరియు నిర్వ హణ లోను అపారమైన అనుభవం ఉంది. ఆయన భూమి శిస్తు నిర్వహణ మరియు జిల్లా పాలన, వ్యవసాయం ఉ సహకారం, ఆరోగ్యం, భవన నిర్మాణం, రవాణా, ఆర్థిక వ్యవహారా లు, శక్తి, జల వనరులు మరియు సామాజిక న్యాయం, ఇంకా సాధికారి త కల్పన మొదలైన విభాగాల లో సేవల ను అందించారు.

# ప్రజలను విస్మరిస్తే పతనం తప్పదు...

హైదరాబాద్ జూన్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూ స్):: పాలితులతో పాలకులు ఎంతగా మమేకమైతే అంతగా ఆదరణ ఉంటుంది. అధికారంలో ఉన్నా లేకున్నా ప్ర జలు అలాంటి పాలకులను గుండెల్లో చిరకాలం చిరస్మరణీయంగా ఉం చుకుంటారు. చరిత్ర పుటల్లో కూడా వారి పేరు చెక్కుచెదరకుండా ఉం టుంది. కాని పాలకులు, పాలితులకు దూరమైతే ఎలా ఉంటుందో, పా లకులకు పాలితులకు మధ్య అధికారులు సైంధవుల్లా రాజ్యాంగేతర శ క్తుల్లా మారి అధికారం చెలాయిస్తే ఎలా ఉంటుందో ఇటీవల మూడు ప్రభుత్వాల పతనాలు నిరూపించాయి. తాజాగా, ఆంధ్రప్రదేశ్‌లో అధికారం కోల్పోయిన వైఎస్ఆర్‌సిపి అధినేత జగన్ రెడ్డి పతనం వెనుక అధికారులే కీలక పాత్ర వహించారని, వారు సిఎంఒ కార్యాలయంలో రాజ్యాంగేతర శక్తులుగా మారి మంత్రులు, ఎంఎల్‌ఎలకు, ప్రజలకు సిఎంను దూరం చేశారని దాని ఫలితమే జగన్ ఓటమి అంటూ ఆ పార్టీకి చెందిన మాజీ ఎంఎల్ఎ జక్కంపూడి రాజా సంచలనంగా వ్యాఖ్యానించారు.సిఎం జగన్ మోహన్ రెడ్డికి ప్రజాక్షేత్రంలో ఏమి జరుగుతుందో, ప్రజల నిజ సమస్యలేమిటో తెలియకుండా సిఎంఒలో ఐఎఎస్ అధికారి ధనుంజయరెడ్డి అడ్డుగోడలు సృష్టించారని రాజా సంచలనంగాబాంబు పేల్చారు. సిఎంఒలో అదనపు కార్యదర్శిగా పని చేసిన కె. ధనుంజయ రెడ్డి సిఎంకు, ప్రజలకు మధ్య పాతాళమంతా అగాథం సృష్టించారని, దీనితో జగన్ మోహన్ రెడ్డి అవమానకరమైన ఓటమిని చవిచూశారని దీనికి ఆ అధికారే కారణమని కూడా రాజా నిందించారు. సీనియర్ ఐఎఎస్ అధికారి ధనుంజయ రెడ్డి సమైక్య రాష్ట్రంలో నాటి సిఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో కీలక అధికారిగా ఎన్నో శాఖల్లో సమర్థుడైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. నిజానికి ఆయన సర్పంచ్ స్థాయి నుంచి ఐఎఎస్‌గా ఎదిగి ఆ తర్వాత పాలకులకు విశ్వసనీయ అధికారిగా జగన్ పాలనలో సిఎంఒ అదనపు కార్యదర్శిగా పని చేసి చివరి సమయంలో విమర్శల పాలు కావలసివచ్చింది.రాజా చేసిన వ్యాఖ్యలు ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా ఆ రాష్ట్రంతో పాటు ఒడిశాలో అధికారం కోల్పోయిన నవీన్ పట్నాయక్, ఐదు నెలల క్రితం సిఎం పదవిని చేజార్చుకున్న కెసిఆర్ సిఎంఒ కార్యాలయానికి కూడా వర్తిస్తాయని ఈ మూడు రాష్ట్రాల అధికార, అనధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అధికారంలో ఉన్నప్పుడు సిఎంఒ కార్యాలయాలు బ్యూరోక్రాట్ల పాలనకు నిలయంగా మారకూడదు. అవి ప్రజలకు, వారి తరపున ప్రతినిధులుగా ఉన్న మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంపిలకు మధ్య వారధిలా ఉండాలి. ఈ అధికారులు సిఎంకు కళ్ళు, చెవులుగా ఉండడమే కాకుండా ప్రజలతో నిత్య సంబంధాలున్న ప్రజా ప్రతినిధులకు కూడా అందుబాటులో ఉండాలి, వారికి సిఎంను కూడా అందుబాటులో ఉంచాలి. అప్పుడే ప్రజాక్షేత్రంలోని అసలు సమస్యలు, పాలనలో మంచి చెడులు అధినేత దృష్టికి వస్తాయి.తప్పులుంటే సరిదిద్దుకునే అవకాశం ఏర్పడుతుంది. కాని ఈ అధికారులు సూపర్ పవర్లుగా మారి ప్రజా ప్రతినిధులకు కూడా అధినేతలను కలిసే అవకాశం కల్పించకపోవడంతో సిఎంలు అధికారం కోల్పోవలసి వస్తుందని రాజా వ్యాఖ్యలను సమర్థిస్తున్న ప్రజాప్రతినిధులు, కొందరు రిటైర్డు అధికారులు అంటున్నారు. ఒడిశాలో 24 ఏళ్ళుగా ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలన సాగించిన నవీన్ పట్నాయక్ పదవీచ్యుతుడు కావడానికి కూడా అక్కడ ప్రైవేటు సెక్రటరీగా పని చేసిన వికె పాండ్యన్ కారణమని రాజకీయ, అధికార వర్గాల్లోనే కాకుండా దేశ వ్యాప్తంగా ప్రచారం జరుగుతున్నది.

# ఆర్థిక శాఖ అధికారులతో ఏపి సిఎస్ సమీక్ష..

అమరావతి, జూన్ 8 :ఆంధ్రప్రదేశ్ సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన నీరభ్ కుమార్ ప్రసాద్.. ఇక, వెంటనే తన పనిపై ఫోకస్ పెట్టారు.. ఈ రోజు సచివాలయంలో ఆర్థిక శాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు.. ఈ సమావేశానికి హాజరైన ఆర్థిక శాఖ ఉన్నతాధికారి సత్యనారాయణ సహా ఇతర అధికారులు హాజరయ్యారు.. ఏపీ ఆర్థిక స్థితి గతులపై కీలకంగా చర్చ సాగింది.. అయితే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై వెంటనే నివేదిక సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు సీఎస్ నీరభ్ కుమార్..

# హరితహారం లక్ష్యాన్ని ఛేదిస్తాం - జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్

హైదరాబాద్, జూన్ 8 : ప్రభుత్వ ఆదేశానుసారం వర్షాకాలం ఆరంభమవుతున్న నేపథ్యంలో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్టు వికారాబాద్ జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్ తెలిపారు.

ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లా కలెక్టర్ సూచన మేరకు 2024 సంవత్సరానికి గాను హరితహారం లక్ష్యం నిర్ణయించుకున్నట్టు తెలిపారు.

జిల్లా మొత్తంలోని అన్ని శాఖలకు 29లక్షల 33వేల మొక్కలు నాటడాలని నిర్ణయించడం జరిగిందని తెలిపారు.

విద్యాశాఖకు 11వేల మొక్కలు పశు సంవత్సరాలకు 5000 మొక్కలు హార్టికల్చర్ డిపార్ట్ మెంట్ కు రెండు లక్షలు పరిశ్రమల శాఖకు 10,000 మొక్కలు, అటవీశాఖకు 3,50,000, డిఆర్డిఏకు 14 లక్షలు, డిపిఓ కు నాలుగు లక్షలు, భూగర్భ శాఖకు 50,000 పౌరసరఫరాల శాఖకు 2000 మొక్కలు, ఎక్సైజ్ డిపార్ట్ మెంట్ కు 15,000 మొక్కలు, వ్యవసాయ శాఖకు 2 లక్షల మొక్కలు, మార్కెటింగ్ శాఖకు 500, పోలీస్ డిపార్ట్ మెంట్ కు పదివేల మొక్కలు, ఇరిగేషన్ శాఖకు 500 మొక్కలు, ఆర్ అండ్ బీ డిపార్ట్ మెంట్ కు 500, మహిళా సీసీ సంక్షేమ శాఖకు వెయ్యి ముక్కలు, తాండ్రు మున్సిపల్ కు 60000 మొక్కలు, వికారాబాద్ మున్సిపల్ కు 70,000 మొక్కలు, కొడంగల్ మున్సిపల్ కు 50,000 మొక్కలు, పరిగి మున్సిపల్ కు 43వేల మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారని, వాటిని నాటేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు.

# అక్షరానికి సామాజిక బాధ్యత ఉందని నిరూపించిన మార్గదర్శి రామోజీ రావు - పవన్ కళ్యాణ్

అమరావతి, జూన్ 8 :ఈనాడు అధిపతి రామోజీరావు అస్తమయం పట్ల జనసేన అధినేత, నటుడు పవన్‌కల్యాణ్ తీవ్రగ్భ్రాంతిని వ్యక్తపరిచారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని, ఆయన కుటుంబానికి జనసేన పక్షాన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు..అక్షరానికి సామాజిక బాధ్యత ఉందని తన పత్రిక ఈనాడు ద్వారా రామోజీ నిరూపించారని తెలిపారు. ప్రజా పక్షం వహిస్తూ వాస్తవాలను వెల్లడిస్తూ జన చైతన్యం కలగించారని, ప్రజా ఉద్యమాలకు అండగా నిలిచారని ప్రశంసించారు. రామోజీ ఫిల్మ్ సిటీ నిర్మాణంతో భారతీయ చిత్ర పరిశ్రమకు హైదరాబాద్‌ను వేదికగా మలిచారని పేర్కొన్నారు

# రామోజీ మృతికి జగన్, ఏపి గవర్నర్ సంతాపం ..

అమరావతి, జూన్ 8 :ఈనాడు సంస్థల అధిపతి రామోజీరావు మృతి పట్ల వైసీపీ అధ్యక్షుడు , ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌గ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతిని చూకూరాలని, భగవంతుడిని ప్రార్థిస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా రామోజీ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

గవర్నర్ సంతాపం..

రామోజీరావు మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. రామోజీరావు మీడియా, వినోద రంగంలో నిష్ణాతుడని, తెలుగు జర్నలిజంలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పడంలో ప్రసిద్ధి చెందారని, జర్నలిజం, సాహిత్యం, సినిమా, విద్యా రంగాల్లో ఎనలేని సేవలందించినందుకు గాను రామోజీరావును పద్మవిభూషణ్‌తో సత్కరించినట్లు తెలిపారు. రామోజీరావు కుటుంబ సభ్యులకు గవర్నర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

అక్షరానికి సామాజిక బాధ్యత ఉందని నిరూపించిన మార్గదర్శి రామోజీ రావు - పవన్ కళ్యాణ్

అమరావతి, జూన్ 8 :ఈనాడు అధిపతి రామోజీరావు అస్తమయం పట్ల జనసేన అధినేత, నటుడు పవన్ కల్యాణ్ తీవ్రగ్భ్రాంతిని వ్యక్తపరిచారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని, ఆయన కుటుంబానికి జనసేన పక్షాన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు..

అక్షరానికి సామాజిక బాధ్యత ఉందని తన పత్రిక ఈనాడు ద్వారా రామోజీ నిరూపించారని తెలిపారు. ప్రజా పక్షం వహిస్తూ వాస్తవాలను వెల్లడిస్తూ జన చైతన్యం కలగించారని, ప్రజా ఉద్యమాలకు అండగా నిలిచారని ప్రశంసించారు. రామోజీ ఫిల్మ్ సిటీ నిర్మాణంతో భారతీయ చిత్ర పరిశ్రమకు హైదరాబాద్‌ను వేదికగా మలిచారని పేర్కొన్నారు

వురిమళ్ల ఫౌండేషన్ - అక్షరాల తోవ సంయుక్త ఆధ్వర్యంలో....

జాతీయ స్థాయి కథలు, కవితల పోటీలు – 2024

'వురిమళ్ల శ్రీరాములు' స్మారక కథల పోటీలు :
- కథ చేతిరాతలో 5 పేజీలకు మించరాదు.
  డి.టి.పి. చేసినచో 3 పేజీలకు మించరాదు.
- అంశం : ఏదైనా సామాజికాంశం
- హామీపత్రం విడిగా రాసి, జతచేయాలి.

నిబంధనలు :

'వురిమళ్ల పద్మజ' స్మారక కవితల పోటీలు :
- కవిత 25 లైన్లకు మించరాదు.
- అంశం : ఏదైనా సామాజికాంశం
- హామీపత్రం విడిగా రాసి, జతచేయాలి.

2024 సంవత్సరానికి గాను "వురిమళ్ల ఫౌండేషన్ - అక్షరాల తోవ" సంయుక్త నిర్వహణలో జాతీయస్థాయి కథలు, కవితలు పోటీలు నిర్వహించనున్నారు.

'వురిమళ్ల శ్రీరాములు' స్మారక కథల పోటీలలో ప్రథమ బహుమతి రూ. 5000/-, ద్వితీయ బహుమతి రూ. 4000/-, తృతీయ బహుమతి రూ. 3000/- లతో పాటు రెండు కన్సలేషన్ బహుమతులు 1000/- ల చొప్పున విజేతలకు ఇవ్వబడును.

'వురిమళ్ల పద్మజ' స్మారక కవితల పోటీలలో ప్రథమ బహుమతి రూ. 4000/-, ద్వితీయ బహుమతి రూ. 3000/-, తృతీయ బహుమతి రూ. 2000/- లతో పాటు రెండు కన్సలేషన్ బహుమతులు 1000/- ల చొప్పున విజేతలకు ఇవ్వబడును.

వీటితో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాహిత్యంలో విశేష కృషి చేస్తున్న వారిలో ఒకరికి "భోగోజు పురుషోత్తం-సముద్రమ్మ" గార్ల సాహితీ పురస్కారంతో పాటు రూ. 10,000/- నగదు బహుమతి అందజేయబడుతుంది.

కవితలు, కథలు పంపాల్సిన చివరి తేది : 30 జూన్ 2024

కథలు, కవితలు పంపాల్సిన చిరునామా :
రాచమళ్ళ ఉపేందర్, స్టార్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, శాంతి లాడ్జి ఎదురుగా, స్టేషన్‌రోడ్, ఖమ్మం - 507001. సెల్ : 98492 77968

పూర్తి వివరాలకు : వురిమళ్ల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు : వురిమళ్ల సునంద, సెల్ : 9441815722

# రామోజీరావు వ్యక్తి కాదు శక్తి - వెంకయ్య నాయుడు

హైదరాబాద్, జూన్ 8 :ఈనాడు సంస్థల అధిపతి రామోజీరావు మృతిపట్ల మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు సంతాపం తెలిపారు. రామోజీ రావు ఒక వ్యక్తి కాదు, శక్తివంతమైన వ్యవస్థ అన్నారు. వ్యక్తిగా మొదలై వ్యవస్థగా ఎదిగిన ఆయన జీవితం నుంచి యువతరం నేర్చుకోవలసిన పాఠాలు ఎన్నో ఉన్నాయని చెప్పారు. తెలుగు వారందరికీ గర్వకారణమైన రామోజీరావు లేని లోటు పూడ్చలేనిదన్నారు.

క్రమశిక్షణ, సమయపాలన, నిబద్ధతలతో అడుగుపెట్టిన ప్రతి రంగంలో ఆయన సృష్టించిన నూతన ఒరవడి ఆదర్శనీయమైనదని తెలిపారు. తెలుగు భాష-సంస్కృతులకు చేసిన సేవ చిరస్మరణీయమైనదని వెల్లడించారు. తెలుగు వారి వెలుగు, మార్గదర్శి అయినా ఈనాడు పత్రిక, రామోజీ ఫిల్మ్ సిటీ ద్వారా ప్రపంచానికి తెలుగు వారి ఘనతను చాటిన ఆయన క్రాంతదర్శనం స్ఫూర్తిదాయకమైనదని చెప్పారు.

రామోజీ గ్రూప్ సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మృతి తీవ్రగ్భ్రాంతికి గురిచేసిందన్నారు అచ్చెన్నాయుడు. సామాన్య రైతు కుటుంబంలో పుట్టి స్వయంకృషితో కష్టపడి అంచలంచెలుగా ఎదిగిన వ్యక్తి రామోజీరావు. ఈనాడు దినపత్రిక స్థాపించి తెలుగు పత్రికా ప్రపంచంలో నవ శకానికి నాంది పలికారు. ఈనాడు మీడియా సంస్థ ద్వారా నిజాలను నిర్భయంగా ప్రసారం చేసి సమాజాన్ని చైతన్యం చేశారు. ఈనాడు ముందడుగు ద్వారా సామాన్యులకు చేరువగా సమాచార హక్కు చట్టం, సుజలాం, సుఫలాం అంటూ పరిశుభ్రత కోసం ఊరూవాడా చైతన్యం వంటి సామాజిక కార్యక్రమాలు చేపట్టారు. ఆయన మృతి మీడియా రంగానికి, తెలుగుజాతికి తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

సిపిఐ రామకృష్ణ..

గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు మరణం పట్ల మా ప్రగాఢ సంతాపం అంటూ ప్రకటించారు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ.. తెలుగు పత్రికారంగంలో పెను మార్పులకు శ్రీకారం చుట్టిన వ్యక్తి రామోజీరావు.. ఆసియాలోనే అతిపెద్ద రామోజీ ఫిలిం సిటీ నిర్మించిన ఘనత ఆయనదే.. రామోజీరావు ఎంచుకున్న ప్రతి రంగంలో విశిష్ట ప్రతిభ కనబరిచారు.. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తున్నాం అన్నారు రామకృష్ణ.. మరోవైపు మీడియా దిగ్గజం రామోజీరావు గారి అస్తమయం చాలా బాధాకరం అన్నారు విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి.. సామాన్యుడి గొంతుకను ప్రపంచానికి తెలియజేసిన ఏకైక వ్యక్తి రామోజీరావు.. అనేక కళలను గుర్తించి, వెలికితీసి వారిని ప్రోత్సహించిన రామోజీరావు మరణ వార్త హృదయాన్ని ద్రవింపజేసింది అన్నారు స్వరూపానందేంద్ర సరస్వతీ.

ఈటెల రాజేందర్ సంతాపం..

ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు అనారోగ్యంతో ఈరోజు తెల్లవారుజామున కన్నుమూశారు. రామోజీరావు మృతి పట్ల సీనియర్ నేత, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సంతాపం తెలిపారు. సాధారణ వ్యక్తిగా కెరీర్ ప్రారంభించి అత్యున్నత స్థాయికి ఎదిగారు. వారు జీవితాంతం కట్టుబడి మరియు క్రమశిక్షణతో ఉంటారు. ఏ పని చేపట్టినా నైతిక విలువలను పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. పత్రిక, టీవీ, సినిమా రంగాల్లో రామోజీరావు సాధించిన విజయాలు తెలుగు జాతికి గర్వకారణం. యావత్ ప్రపంచానికి తెలుగు శక్తిని చాటిచెప్పిన రామోజీరావు చిరస్థాయిగా నిలిచిపోతారు. రామోజీరావుకు వామపక్ష భావజాలం ఉండేది. రామోజీ రావు మహనీయులు. రామోజీరావు కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను" అని ఈటల రాజేందర్ అన్నారు.

## రామోజీ రావు మరణంతో గొప్ప వ్యక్తిని కోల్పోయిన పత్రికా రంగం

### - బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీ రుద్రమ

హైదరాబాద్ జూన్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తీవ్రగ్భ్రాంతిని వ్యక్తం చేసారు. మీడియా మొఘల్ రామోజీ రావు మరణం నన్ను చాలా ఆవేదనకు గురి చేసిందనిఆమె తన సంతాప సందేశం లో పేర్కొన్నారు. మీడియా రంగంలో వారు పెట్టిన ఈటివి ద్వారా మొదట ఉద్యోగం తెచ్చుకోవడం ఆ నాడు చాలా గొప్ప విషయం. ఎన్నో వేల మంది పోటీ పడినా తెలంగాణ ప్రాంతం నుంచి నాకు అవకాశం కల్పించిన రామోజీ రావు గారు నాకు పితృ సమానులు. ఈనాడు లో వారు నేర్పిన క్రమశిక్షణ , కష్టపడే తత్వం మీడియా లో నా లాంటి ఎంతో మందికి వృత్తి పట్ల అంకిత భావాన్ని పెంపొందించినీది. తెర మీద కనిపిస్తామని మమ్మల్ని తారలు అని పిలిచే వారి పిలుపు , వారిని కలిసిన సందర్భాల్లో వారు చెప్పిన మాటలు , వారు చూపిన వ ా ం ని ం శ నీ మరువలేనిదన్నారు..జర్నలిజం, సినిమా, వ్యాపార రంగాల్లో నూతన వొరవడులకు శ్రీకారం చుట్టి ఎన్నో వేల మందికి ఉపాధి కల్పించిన రామోజీ రావు నేటి తరానికి మార్గదర్శకులు. వారి మరణానికి చింతిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తో , రామోజీ రావు ఆత్మకు శాంతి కలగాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నాను.

# సుందిళ్ల బ్యారేజీ మరమ్మతు పనులను పరిశీలించిన జస్టిస్ చంద్రఘోష్



హైదరాబాద్, జూన్ 8 :తెలంగాణ రాష్ట్రంలోని కాళేశ్వరం ప్రాజెక్టుల్లో బ్యారేజీల వైఫల్యాలపై విచారణ జరుపుతున్న ఆ కమిటీ చైర్మన్ సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ పినాకి చంద్రఘోష్ ఇవాళ పెద్దపల్లి జిల్లా మంథని మండలం సిరిపురం వద్ద ఉన్న పార్వతి బ్యారేజీ (సుందిళ్ల)ని పరిశీలించారు. బ్యారేజీ వద్ద జరుగుతున్న మరమ్మతులను పరిశీలించారు. పనుల వివరాలను ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అంతకు ముందు సుందిళ్ల గ్రామంలోని శ్రీ లక్ష్మి నరసింహాస్వామి దేవాలయంలో చంద్రఘోష్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంపై విచారణ చేపట్టేందుకు చంద్రఘోష్ శుక్రవారం రాత్రే పెద్దపల్లి జిల్లాకు చేరుకున్నారు. రామగుండంలోని ఎన్టీపీసీ అతిథి గృహంలో బస చేశారు. ఇవాళ బ్యారేజీల సందర్శనకు వెళ్లారు.

# వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎంఎల్సీగా తీన్మార్ మల్లన్న విజయకేతనం



హైదరాబాద్ జూన్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్);వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్సి తొలిసారి హస్తగతం కానుంది. ఇప్పటివరకు ఎన్నికలు జరిగిన ప్రతిసారీ గులాబీ పార్టీ విజయకేతనం ఎగురవేసింది. ఈసారి జరిగిన హోరాహోరీ పోరులో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయకేతనం ఎగురవేశారు. బిఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి తీవ్ర పోటీ ఇచ్చినప్పటికీ విజయం మాత్రం తీన్మార్‌కే దక్కింది. గ్రాడ్యుయేట్స్ అధికార కాంగ్రెస్‌వైపే ఉన్నారన్నది ఈ ఉప ఎన్నికలో తేలిపోయింది. తొలిసారి గ్రాడ్యుయేట్స్ స్థానం హస్తగతం కావడంతో ఆ పార్టీ శ్రేణులు ఆనందంలో మునిగిపోయారు. ఎలిమినేషన్ రౌండ్ లెక్కింపు పూర్తయినప్పటికీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఫలితం ప్రకటించనున్నారు. అర్ధరాత్రి తుది ఫలితం ప్రకటించే అవకాశముంది. పట్టభద్రుల ఎంఎల్సి ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు మూడురోజుల పాటు కొనసాగింది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ అభ్యర్థుల మధ్య పోరు హోరాహోరీగా సాగింది. మొదటి ప్రాధాన్యత ఓట్లలో 19 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఆధిక్యంలో ఉన్నారు. అయితే గెలుపు కోటా రావాలంటే 1,55,095 ఓట్లు కావాలి. తీన్మార్ 32,282 ఓట్ల దూరంలో ఉన్నారు.రెండో స్థానంలో బిఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి ఉన్నారు. గెలుపు కోటా కోసం అధికారులు రెండో ప్రాధాన్యత ఓట్ల ఎలిమినేషన్ రౌండ్ ప్రారంభించారు. 52 మంది అభ్యర్థులు పోటీలో ఉండటం.. వారికి వచ్చిన ఓట్ల ప్రకారం ఎలిమినేషన్ చేయాలి. తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థి నుండి ఎలిమినేషన్ ప్రారంభించారు. స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్‌గౌడ్‌కు వచ్చిన 30,461 ఓట్లు.. బిజెపి అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి వచ్చిన 43,956 ఓట్లను చివరిగా లెక్కించారు. బిఆర్ఎస్ నేతలు మాత్రం స్వతంత్ర అభ్యర్థి, బిజెపి అభ్యర్థికి వచ్చిన రెండో ప్రాధాన్యత ఓట్లు తమకే అధిక శాతం షేర్ జరిగి గెలుస్తామనే ధీమాతో ఉన్నారు.కానీ అశోక్‌గౌడ్‌కు వచ్చిన ఓట్లను లెక్కించినప్పుడు దాదాపుగా కొంచెం అటుఇటుగా ఇద్దరికీ సమానంగానే షేర్ అయినట్లు చెబుతున్నారు. బిజెపి అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి ఓట్ల షేరింగ్ మాత్రం ఆరు వేల ఓట్ల వరకు బిఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి వచ్చాయి. అప్పటికి కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న 14 వేల ఓట్లకు పైగానే ఆధిక్యంలో ఉన్నారు. అయితే కోటా కోసం లెక్కించాలంటే రాకేష్‌రెడ్డిని ఎలిమినేట్ చేయాలి. లేదంటే మల్లన్నకు ఉన్న మెజార్టీ ప్రకారం గెలుపు ప్రకటించాలిందే. రాత్రి పది గంటల వరకు ఎలిమినేషన్ రౌండ్ ఎవచ్చిన ఓట్లను ఒకటికి రెండుసార్లు చూసిన అనంతరం ప్రకటించనున్నారు. ఏదిఏమైనా వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎంఎల్సి తొలిసారి కాంగ్రెస్ ఖాతాలోకి వచ్చిందని చెప్పవచ్చు. ఎంఎల్సిగా తమ పార్టీ అభ్యర్థి గెలుపొందనుండడంతో అధికార పార్టీ నేతలు, కార్యకర్తలు సంబరాల్లో మునిగిపోయారు.

# ప్రజా సేవ అంటే శవానికి సేవే!

## -బీజేపీ నేత బూర నర్సయ్య



నల్గొండ, జూన్ 8 :భువనగిరిలో ఎయిమ్స్ లాంటి సంస్థల ఏర్పాటు, రూ.900 కోట్లతో అభివృద్ధి పనులు చేసినా, రూ.500 లకు ఓటు అమ్ముకుని తనను ఓడించారని మాజీ ఎంపీ, భువనగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ అన్నారు. స్టార్ బ్యాడ్మింటెన్ క్రీడాకారుడు సైనా నెహ్వాల్ టీట్‌కు స్పందిస్తూ ఎక్స్ వేదికగా పలు సంచలన వ్యాఖ్యలు చేశారు. హిందు ఓటర్ల పరిస్థితి చాలా దయనీయంగా ఉందని పేర్కొనారు. ఈ ఓటమి రామమందిరం కోసం ప్రాణాలు అర్పించిన వారిని అవమానించడేమేనని అన్నారు.

ప్రజా సేవడం అంటే..

ప్రజలకు సేవ చేయడం అంటే శవానికి సేవ చేయడం లాంటింది అని తెలుగులో ఓ సామెత ఉందని గుర్తు చేశారు. కాగా అయోధ్యలో ఓ యువకుడు భావోద్వేగంతో చేసిన వ్యాఖ్యలకు సంబందించిన వీడియోను హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాదవీలత పోస్ట్ చేస్తూ.. ఈ సోదరుడి కన్నీళ్లు వృథాగా పోవు అని ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. దీనిపై బ్యాడ్మింటెన్ క్రీడాకారుడు సైనా నెహ్వాల్ చాలా దు:ఖంతో మాట్లాటారని, అందుకు బూర నర్సయ్య పై విధంగా ట్వీట్ చేశారు. మీ ఓటమి ఆశ్చర్యాన్ని కల్గిస్తుందని, మీరు సహనాన్ని కోల్పోవద్దు. మళ్లీ ప్రయత్నించి మంచి ఫలితాలు సాధించాలి అంటూ నెటిజన్లు కామెంట్ పెడుతున్నారు.

# ఖమ్మం జిల్లాలో ఊరిస్తున్న మేఘాలు - కానరాని చినుకులు

ఖమ్మం, జూన్ 8 :ఉమ్మడి ఖమ్మం-ఆంధ్రప్రభ బ్యూరో ఖమ్మం జిల్లాలో నేటికీ వర్షాల జాడ లేదు. రాష్ట్రంలో నాలుగైదు రోజుల కిందట నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. ఆ ప్రభావం జిల్లాలో లేకపోవడంతో ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. ప్రతి రోజూ సాయంత్రం మేఘాలు ఊరించడం, చిరు జల్లు పడడం తప్ప వర్షాలు పడటం లేదు. భూములు పదునెక్కేలా ఒక్క వర్షం కూడా పడలేదు. వర్షాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

సాగుకు సిద్ధం చేసిన భూములు

ఖమ్మం జిల్లాలో ఖరీఫ్ కోసం భూములను రైతులు సిద్ధం చేశారు. ఈ ఏడాది వరి సాగుకు 2,83,943 ఎకరాలు, పత్తి సాగుకు 2,01,834 ఎకరాలు, మిర్చి సాగుకు 88,906 ఎకరాలు, మొక్కజొన్న సాగుకు 3,374 ఎకరాలు, కంది సాగుకు 1,005 ఎకరాలు, చెరుకు సాగుకు 2,432 ఎకరాలకు రైతులు రెడీగా ఉన్నారు. వరుణుడి కరుణ కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

విత్తనాలు కూడా సిద్ధం

ఖరీఫ్ నిమిత్తం ఖమ్మం జిల్లాలో 70,986 క్వింటాళ్ల వరి విత్తనాలను వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధం చేశారు. అదేవిధంగా 5 లక్షల ప్యాకెట్ల పత్తి విత్తనాలను అందుబాటులో ఉంచారు. 90 క్వింటాళ్ల మిర్చి విత్తనాలు, 135 క్వింటాళ్ల మొక్కజొన్న విత్తనాలు, 1229 క్వింటాళ్ల పెసర విత్తనాలు కూడా రెడీగా ఉన్నాయి. నకిలీ విత్తనాల విక్రయాలు జరగకుండా జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ చర్యలు చేపట్టారు.

అందుబాటులో ఎరువులు

ఖరీఫ్‌లో రైతులకు కావలసిన యూరియా, డీఏపీ, ఎంఓపీ, కాంప్లెక్స్, ఎస్ఎస్ పి రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. మొత్తం రెండు లక్షల 24 వేల 819.88 మెట్రిక్ టన్నుల ఎరువులను పంపిణీకి అధికారులు సిద్ధం చేశారు.

# కల్తీ ఫుడ్‌పై అధికారుల కొరడా



నిజామాబాద్, జూన్ 8 :చూస్తే నోరూరె.. తింటే కంగారే.. అన్నచందంగా తయారైంది నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రెస్టారెంట్ల పరిస్థితి. శనివారం నిజామాబాద్ నగరంలోని కల్తీ ఫుడ్ పై అధికారులు కొరడా ఝులిపించారు. ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ అధికారులు, కంట్రోలర్ నగరంలోని పలు హోటళ్లపై దాడులు నిర్వహించారు.

నగరంలోని హైదరాబాద్ రోడ్డు వద్ద గల అరోమా రెస్టారెంట్ లో ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. అరోమా రెస్టారెంట్ వంటశాలను పూర్తిగా పరిశీలించారు. ఈ దాడిలో నిలువ ఉంచిన చికెన్, ఫిష్ మాంసం, కలరు వాడిన బిర్యానీ, అధికారులు స్వాధీనం చేసు కుని చెత్తబుట్టలో వేశారు. అదేవిధంగా నగరంలోని పలు రెస్టారెంట్లను కూడా అధికారులు తనిఖీలు చేపట్టారు.

# నిరుద్యోగులకు హామీ ఇచ్చిన 2 లక్షల 50 వేల ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలి

## -బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీ సీ.హెచ్ విఠల్ డిమాండ్




హైదరాబాద్ జూన్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుద్యోగులకు హామీ ఇచ్చిన 2 లక్షల 50 వేల ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీ సీ.హెచ్ విఠల్ డిమాండ్ చేసారు.శనివారం పార్టీ రాష్ట్ర కార్యాలయం లో మీడియా సమావేశం లో ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడి 6 నెలలు గడిచింది. అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలకు అనేక రకాల హామీలిచ్చారని, కాంగ్రెస్ మేనిఫెస్టోలో రైతులు, నిరుద్యోగులకు సంబంధించి ప్రధానంగా హామీలిచ్చారు. వివిధ రకాల డిక్లరేషన్లు ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు.రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో 2 లక్షల ఉద్యోగ ఖాళీలను పూర్తిచేయకపోవడం, ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకపోవడంతో నిరుద్యోగులు ఆక్రోశానికి గురయ్యారు.రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులు బీఆర్ఎస్ సర్కారుపై కక్షగట్టి గద్దెదించి, కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల ఆవేదనను పట్టించుకోవడం లేదు.2 లక్షల ఉద్యోగాలు ఇవ్వడం, నిరుద్యోగ భృతి అమలు, టీఎస్ పీఎస్సీ ప్రక్షాళన, డీఎస్సీ నోటిఫికేషన్ జారీ, జాబ్ క్యాలెండర్ వంటి అనేక హామీలను ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది.కాని, 6 నెలలు గడిచినా నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లతో మాత్రమే ఖాళీ ఉద్యోగాలను పూరించింది తప్పితే.. ఇప్పటివరకు ఒక్క జాబ్ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. 2 లక్షల ఖాళీ ఉద్యోగాల భర్తీ కోసం జూన్ 2 తారీఖు లోగా నోటిఫికేషన్లు ఇచ్చి, పరీక్షలు నిర్వహించి సెప్టెంబరు 17 లోగా నియామకపత్రాలు ఇస్తామని స్వయంగా రేవంత్ రెడ్డి ప్రకటించారు. నిరుద్యోగులకు రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ఏమైంది..? 2 లక్షల ఉద్యోగ ఖాళీల్లో 200 కూడా పూరించలేదు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగ విరమణ వయస్సును 61 సంవత్సరాలకు పెంచింది.జూన్ మాసం తర్వాత పెద్దఎత్తున ఉద్యోగులు (సుమారు 50 వేల మంది) రిటైర్ కాబోతున్నారు. దీంతో గతంలోని 2 లక్షల ఉద్యోగ ఖాళీలకు తోడు అదనంగా 50 వేల ఉద్యోగ ఖాళీలు ఏర్పడనున్నాయి.అసలు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో మొత్తం 2 లక్షల 50 వేల ఖాళీలను ఎప్పుడు నింపుతారనేది సమాధానం చెప్పాలి.గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో మోసపోయిన నిరుద్యోగుల పక్షాన ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం, నిరుద్యోగ భృతి అమలు కోసం, టీఎస్ పీఎస్సీ ప్రక్షాళన కోసం బిజెపి పోరాటం చేసింది.రాష్ట్రంలో 30 లక్షల మంది నిరుద్యోగులు బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఆక్రోశంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారు. అయితే నిరుద్యోగులకు రేవంత్ ప్రభుత్వం కూడా అన్యాయమే చేస్తోంది.ఇన్నిరోజులు ఎన్నికల కోడ్ సాకుతో ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా కాలయాపన చేసింది.రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులు ఆవేదనతో కుమిలిపోతున్నారు.ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల 50 వేల ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ విటల్ డిమాండ్ చేసారు.లేదంటే, గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి బుద్ధిచెప్పిన విధంగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజల తిరస్కారానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

రామోజీ రావు మృతి తీరనిలోటు

ఈనాడు గ్రూప్ చైర్మన్ రామోజీ రావు మృతిపట్ల సీ.హెచ్ విఠల్ గ్భ్రాంతిని వ్యక్తం చేశారు.ఈనాడు గ్రూప్ అధినేత శ్రీ రామోజీరావు గారి మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ.. రామోజీ కుటుంబ సభ్యులు, ఈనాడు గ్రూప్ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.మీడియా, సినిమా, వ్యాపార, సామాజిక సేవా రంగంలో రామోజీ రావు గారి సేవలు ఎనలేనివన్నారు.రామోజీ జీవితమే ఒక క్రమశిక్షణతో కూడుకున్నది.. ఈనాడు సంస్థలో పనిచేసిన సిబ్బంది కూడా క్రమశిక్షణతో వనిచేస్తారని కొనియాడారు.

# తీన్మార్ మల్లన్న విజయానికి సహకరించిన పట్టభద్రులందరికీ కృతజ్ఞతలు

## - ఓబిసిజిల్లా ప్రధానకార్యదర్శి బమ్మిడి శ్రీనివాస్ యాదవ్



ఖమ్మం, జూన్ 8 :(నేటినిజం ప్రతినిధి): ఖమ్మం-నల్గొండ-వరంగల్ పట్టబద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఘన విజయం సాధించటంతో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ ఓబీసీ ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ...తీన్మార్ మల్లన్న విజయంతో విద్యావంతులకు రానున్న రోజుల్లో ఎంతో మేలు జరుగుతుందని వారి తరఫున పోరాడడానికి సరైన ఆయుధాన్ని వెతికి ఓటు వేశారని వారు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

# రామోజీరావు మరణం చాలా బాధాకరం- మాజీమంత్రి తలసాని



హైదరాబాద్, జూన్ 8 : ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు మరణం చాలా బాధాకరమని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రామోజీరావు మృతి వార్త తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఆయన మరణం అత్యంత విషాదకరమన్నారు. రామోజీరావు మృతి పట్ల తన ప్రగాడ సంతాపాన్ని తెలుపుతున్నానన్నారు.

ఆధునిక జర్నలిజానికి పితామహుడుగా నిలిచిన రామోజీరావు మృతి మీడియా రంగానికి తీరని లోటన్నారు. అనేక సంస్థలను ఏర్పాటు చేసి వేలాది మందికి ఉపాధి కల్పించారన్నారు. నిరంతరం ప్రజల మంచికోసం, సమాజ హితం కోసం పరితపించి పనిచేసిన గొప్ప వ్యక్తి రామోజీరావు అన్నారు. రామోజీరావు మరణం ఒక్క తెలుగు ప్రజలకే కాదు దేశానికి కూడా తీరని లోటన్నారు.

# డీజీ జితేందర్‌కు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బాధ్యతలు



హైదరాబాద్, జూన్ 8 :రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరిగా విధులు నిర్వహిస్తున్న సీనియర్ ఐపీఎస్ అధికారి, డీజీ జితేందర్‌కు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ బాధ్యతలను అప్పగించారు. ఈ క్రమంలో శుక్రవారం నాడు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఉన్న శాఖలతో పాటు అదనంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ బాధ్యతలను అప్పగించినట్లు ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు.

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగియడంతో ప్రభుత్వం పోలీస్ శాఖలో భారీ ప్రక్షాళనకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ఒకటి రెండు రోజుల్లో భారీ ఎత్తున ఐపీఎస్ అధికారుల బదిలీలు జరిగే అవకాశం ఉన్నట్టు సమాచారం. డీజీపీ, పలువురు పోలీస్ కమిషనర్లు సహా పలు కీలక పోస్టుల్లో ఉన్న అధికారులకు స్థాన చలనం తప్పదనే చర్చ జోరుగా నడుస్తోంది.

కీలక బాధ్యతల్లో కొత్త అధికారులను నియమించడంతో పాటు ఇప్పటికే ఒకటికి మించి అదనపు పోస్టులతో పని భారం ఉన్న అధికారులకు ఉపశమనం కలిగించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు మూడు కమిషనరేట్‌లలో సీపీలలోనూ మార్పు చేర్పులు జరిగే అవకాశం ఉందని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి.

# రామోజీ రావు మరణం పట్ల ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి

హైదరాబాద్ జూన్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఈనాడు గ్రూప్ చైర్మన్ రామోజీ రావు మరణం దేశానికిగ్భ్రాంతి కలిగించిందని బిజెపి మాజీఎంఎల్ఏ మరియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ పేర్కొన్నారు. మీడియా మరియు న్యూస్ ఛానెల్‌ల రంగంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయం, తుఫాను ప్రాంతాలలో సేవ లు, భూకంప ప్రాంతాలు స్ఫూర్తిదాయకం, రామోజీరావు సాదాసీదా జీవనం మరియు ఉన్నత ఆలోచనలతో సరళత మరియు కాఠిన్యానికి పేరు గాంచిన గొప్ప వక్తి అని కొనియాడారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను, మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు.

# అక్షర యోధుడికి అశ్రునివాళులు-మాజీ మంత్రి జగదీష్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 8 :తెలుగు జర్నలిజంలో నూతన అధ్యాయం సృష్టించిన అక్షరయోధుడు రామోజీరావు మనకిక లేరన్న వార్త జీర్ణించుకోలేనిదని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. ముఖ్యంగా తెలుగు భాష పరిరక్షణలో ఆయన తీసుకున్న చొరవ అద్వితీయమైనదన్నారు. అదే తెలుగు భాషను కాపాడేందుకా అన్నట్లు ఆయనకున్న ప్రసార మాధ్యమం ఈటీవీ చేపట్టిన పాడుతా తీయగా కార్యక్రమం తెలుగుబాషకు, తెలుగు స్వరానికి పట్టం కట్టించిన ఘనత ముమ్మాటికీ రామోజీరావు దేనన్నారు. అటువంటి అక్షర యోధుడు రామోజీ రావు మరణం పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నామన్నారు.

# నరేంద్రమోదీ క్యాబినెట్‌లో జేడీయూకు రెండు మంత్రి పదవులు.. ఆ ఇద్దరు ఎవరంటే..!



హైదరాబాద్, జూన్ 8 : కొత్తగా కొలువుదీరబోతున్న నరేంద్రమోదీ ప్రభుత్వంలో నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ లోని కీలక భాగస్వామ్యపక్షమైన జనతాదల్–యునైటెడ్ కు రెండు క్యాబినెట్ బెర్త్‌లు దక్కనున్నాయి. పార్టీలోని ఇద్దరు సీనియర్ నాయకులకు కేంద్ర మంత్రి పదవులు దక్కనున్నాయి. జేడీయూలోని విశ్వసనీయ వర్గాలు ఈ విషయాన్ని వెల్లడించాయి.

తమ పార్టీలో మంత్రి పదవులు ఎవరికి ఇవ్వాలనే దానిపై జేడీయూ ఇప్పటికే ఒక ప్రతిపాదన చేసినట్లు తెలిసింది. సీనియర్ నేతలైన లలన్‌సింగ్, రామ్‌నాథ్ ఠాకూర్ పేర్లను కేంద్ర పదవుల కోసం జేడీయూ ప్రతిపాదించినట్లు సమాచారం. లలన్‌సింగ్ బీహార్‌లోని ముంగేర్ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. రామ్‌నాథ్ ఠాకూర్ రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు.

రామ్‌నాథ్ ఠాకూర్ ఇటీవల మరణానంతరం భారతరత్న అవార్డు పొందిన కర్పూరీ ఠాకూర్ కుమారుడు. కాగా ఈ లోక్‌సభ ఎన్నికల్లో జేడీయూ 12 లోక్‌సభ స్థానాలు దక్కించుకుంది. బీజేపీకి సొంత మెజారిటీ రాకపోవడంతో ఎన్డీఏ భాగస్వామ్యపక్షాలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నది. అందులో కేంద్ర మంత్రులుగా ఎవరెవరు ప్రమాణస్వీకారం చేస్తారనేది ఆదివారం ప్రమాణస్వీకార కార్యక్రమంలోపు నిర్ణయిద్దామని, శుక్రవారం జరిగిన ఎన్డీఏ భాగస్వామ్యపక్షాల సమావేశంలో నిర్ణయించారు. ఆ మేరకు రేపు సాయంత్రంలోగా మంత్రులుగా ఎవరెవరు ప్రమాణస్వీకారం చేస్తారనేది నిర్ణయించనున్నారు.

# రామోజీరావు మృతిపట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన కాంగ్రెస్ నేత

## – ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీనివాస్ యాదవ్

ఖమ్మం, జూన్ 8 :(నేటినిజం ప్రతినిధి): మీడియా రంగంలో విలువలతో కూడిన నూతన ఒరవడికి, ఎన్నో సంస్కరణలకు ఆద్యుడు రామోజీరావు అని గుర్తుచేసుకున్న ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీనివాస్ యాదవ్

ఆయన మృతి మీడియా రంగానికి, తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు

ఆయన మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ప్రతిపక్ష నేతగా బాధ్యతలు తీసుకోండి.. మీడియాలో రాహుల్‌గాంధీకి విజ్ఞప్తి.. ఆయన ఏమన్నారంటే..!



న్యూఢిల్లీ, జూన్ 8 :రాహుల్‌గాంధీయే లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ కోరింది. ఇవాళ ఢిల్లీలో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సీడబ్ల్యూసీ సమావేశం ముగిసిన అనంతరం కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, పార్టీ అధికార ప్రతినిధి జైరామ్ రమేశ్ మీడియాతో మాట్లాడారు.

లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించాలని సీడబ్ల్యూసీ సమావేశంలో తాము ఏకగ్రీవంగా ప్రతిపాదన చేశామని కేసీ వేణుగోపాల్ చెప్పారు. తమ ప్రతిపాదనపై ఆలోచించి నిర్ణయం తీసుకుంటానని రాహుల్‌గాంధీ చెప్పారని ఆయన తెలిపారు. సాధ్యమైనంత త్వరలో తన నిర్ణయాన్ని వెల్లడిస్తానని చెప్పారని అన్నారు. రెండు చోట్ల గెలిచిన రాహుల్‌గాంధీ ఏ స్థానానికి రాజీనామా చేస్తారని మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు.

ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ, కేరళలోని వాయనాడ్ నుంచి గెలిచిన రాహుల్‌గాంధీ రెండింట్లో ఏదో ఒక స్థానాన్ని వదులుకునేందుకు ఈ నెల 15 వరకు గడువు ఉన్నదని, కానీ ఈ మూడు నాలుగు రోజుల్లో ఆయన నిర్ణయం తీసుకుంటారని కేసీ వేణుగోపాల్ చెప్పారు. నితీశ్ కుమార్ ఇండియా కూటమి వైపు వస్తే పీఎం పదవి ఇస్తామని ఆఫర్ చేసినట్లు కేసీ త్యాగి చెబుతున్నారుగా అన్న ప్రశ్నకు.. ఆ విషయం తనకు తెలియదని అన్నారు.

# విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలి

## –సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతి



హైదరాబాద్, జూన్ 8 : పోలీసులు విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ పతకాలు సాధించాలని సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతి అన్నారు. కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వర్తిస్తూ ఉత్తమ ప్రతిభ చూపిన సిబ్బందికి శుక్రవారం కమిషనరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో సీపీ పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ అవినాశ్ మహంతి మాట్లాడుతూ.. సేవా పతకాలను అందుకున్న సిబ్బందిని అభినందించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపిన పోలీస్ సిబ్బందిని గుర్తించేందుకు ప్రతి సంవత్సరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సేవా పతకాలను అందజేస్తాయని, అందులో భాగంగానే 2023 సంవత్సరానికి సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 75 మంది పోలీస్ సిబ్బందికి పతకాలు అందజేసినట్టు తెలిపారు.

వీరిలో ముగ్గురికి మహోన్నత సేవా పతకాలు, 18 మందికి ఉత్తమ సేవా పతకాలు, 54 మందికి సేవా పతకాలు లభించినట్లు సీపీ వివరించారు. ఈ పతకాలు అందుకున్న వారిలో కానిస్టేబుల్ నుంచి డీసీపీ స్థాయి వరకు ఉన్నట్లు తెలిపారు. పతకాలు అందుకోవడం వల్ల సిబ్బందిలో ఉత్సాహం, పనితనంలో పోటీతత్వం పెరుగుతుందన్నారు. ఇతర సిబ్బంది కూడా విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపి పతకాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ జాయింట్ సీపీ (ట్రాఫిక్) డి. జోయెల్ డేవిస్, క్రైమ్ డీసీపీ కె. నరసింహ, ఆర్థిక నేర విభాగం డీసీపీ కె. ప్రసాద్, ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ డీసీపీ సృజన కర్ణం, ఎస్‌బీ డీసీపీ సాయిశ్రీ, రోడ్ సేఫ్టీ డీసీపీ ఎల్‌సీ నాయక్, ఎస్‌ఓటీ డీసీపీ డి. శ్రీనివాస్, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ అదనపు డీసీపీ జెఎస్‌కె. షమీర్‌తో పాటు ఏడీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# శనివారం ఒక్కరోజే రూ.2000 తగ్గిన బంగారం.. అదే బాటలో వెండి..

హైదరాబాద్, జూన్ 8 : అంతర్జాతీయ మార్కెట్లో పరిస్థితులకు అనుగుణంగా దేశీయ బులియన్ మార్కెట్‌లో శనివారం బంగారం, వెండి ధరలు భారీగా తగ్గాయి. వృద్ధిరేటు పెరుగుతుందని ఆర్బీఐ ప్రకటించడంతోపాటు పెండ్లిండ్ల సీజన్ ప్రారంభం కానుండటంతో బంగారం, వెండి ధరలు తగ్గడం ప్రాధాన్యం సంతరించుకున్నది. శనివారం దేశంలో బంగారం ధర తులం (24 క్యారట్స్) రూ. 2080 తగ్గింది. ఇటీవలి కాలంలో బంగారం ధర భారీగా తగ్గడం ఇదే తొలిసారి. దేశంలో 24 క్యారట్ల బంగారం తులం ధర రూ. 2080 తగ్గి రూ. 71,670 వద్ద ముగిసింది. శుక్రవారం రూ. 73,750 వద్ద నిలిచింది. ఆభరణాల తయారీలో వినియోగించే 22 క్యారట్ల బంగారం తులం ధర రూ. 1900 తగ్గి రూ. 65,700 పలికింది. దేశ రాజధాని ఢిల్లీలో శనివారం కిలో వెండి ధర రూ. 4500 తగ్గి రూ. 91,500 పలికింది. శుక్రవారం రూ. 96 వేలు పలికింది.

# ఇండియన్ రెడ్‌క్రాస్ సోసైటి ఆధ్వర్యంలో వయో వృద్ధుల కోసం వైద్య శిబిరం




హైదరాబాద్ జూన్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఇండియన్ రెడ్‌క్రాస్ సోసైటి హైదరాబాద్ వారి ఆరోగ్య శిబిరం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ బ్రాంచ్ చైర్మన్ మామిడి భీంరెడ్డి , క్యాంప్ కో కన్వీనర్ కే. కళావతి అద్వర్యం లో 08-06-2024 నాశ్రీ వెంకటేశ్వర, శ్రీ హనుమాన్ గుడి బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 14 లో (ఎంఎంయు) 60 సంవత్సరాల పైబడిన వారి కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేసారు. డాక్టర్, శ్రీజ రెడ్డి, డాక్టర్ హారి ప్రియ రోగులను పరీక్షించి చికిత్స చేసి మందులు పంపిణి చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి, వైస్ చైర్మన్ శ్రీమతి కే. విజయ కుమారి, ఎమ్ సి మెంబర్ శ్రీ కే. నాగేంద్ర , సుబ్బ లక్ష్మి ,, , విజయ ,, శ్రీ ధర్మ తేజ, శ్రీ సతీష్ సుజాత, సత్యనారాయణ, , సందీప్, గోపాల్ పాల్గొన్నారు

# సీఈఐఆర్ విధానం ద్వారా భారీగా సెల్ ఫోన్లు రికవరీ చేసిన పోలీసులు..



హైదరాబాద్, జూన్ 8 :సీఈఐఆర్ విధానం ద్వారా సనత్‌నగర్ పోలీసులు పెద్దఎత్తున సెల్ ఫోన్లురికవరీ చేశారు. గత సంవత్సరం ఏప్రిల్ నుంచి తమ సెల్ ఫోన్లు పోయాయంటూ పలువురు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

పోలీసులు సీఈఐఆర్ ద్వారా దాదాపు 90 మొబైల్ ఫోన్లను రికవరీ చేశారు. కొద్ది రోజులుగా దాదాపు 73 రికవరీ చేసిన సెల్‌ఫోన్లు ఫిర్యాదుదారులకు అందజేశారు. తాజాగా శుక్రవారం మరో 17 సెల్‌ఫోన్లను సనత్‌నగర్ పీఎస్‌లో ఇన్‌స్పెక్టర్ పురేందర్‌రెడ్డి, డీఐ నాగిరెడ్డితో కలిసి బాధితులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ పురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత సంవత్సరం ఏప్రిల్ నుంచి చోరీకి గురైన సెల్‌ఫోన్ల ఫిర్యాదులపై సీఈఐఆర్ విధానంతో ఫోన్లను ఆయా ఐఎంఈఐ నెంబర్లపై ట్రాకింగ్ చేశామని తెలిపారు. ఎప్పటికప్పుడు రికవరీ అవుతున్న ఫోన్లను ఫిర్యాదు దారులకు అందజేస్తూ వస్తున్నామని, తాజాగా 17 సెల్ ఫోన్లను శుక్రవారం పీఎస్‌లో అందజేసినట్లు ఆయనతెలిపారు.

కాగా, చోరీకి గురైన సెల్ ఫోన్లను ట్రాకింగ్ చేయడంలో చురుగ్గా వ్యవహరించిన సనత్‌నగర్ మహిళా పీసీ గౌతమిని ఇన్‌స్పెక్టర్ పురేందర్‌రెడ్డి అభినందించారు.గౌతమికి రివార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఐ అరుణ్‌కుమార్, పీసీలు శేఖర్, బాలకృష్ణ, ఇబ్రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

# భార్యతో గొడవ.. కిరోసిన్ పోసి ఇంటిని కాల్చేసిన భర్త

హైదరాబాద్, జూన్ 8 :దంపతుల మధ్య మొదలైన ఓ చిచ్చు వారు ఉంటున్న ఇంటినే కాల్చేసింది. భార్యతో గొడవ కావడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఓ భర్త కిరోసిన్ పోసి ఏకంగా ఇంటికే నిప్పు పెట్టాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది.

వివరాల్లోకి వెళ్తే.. తంగళ్లపల్లి మండలం పద్మనగర్‌కు చెందిన బాల పోశయ్య, రాజేశ్వరి దంపతులు శనివారం మధ్యాహ్నం గొడవ పడ్డారు. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన భర్త పోశయ్య ఇంటిపై కిరోసిన్ పోసి నిప్పంటించాడు. ఒక్కసారిగా ఇంటికి మటలు అంటుకోవడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనాస్థలికి వచ్చిన ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పేశారు. కాగా, ఈ ఘటనలో భార్యాభర్తలకు స్వల్ప గాయాలయ్యాయి. ఇల్లు పూర్తిగా దగ్ధమయ్యింది.

# 50 మందిలోపు విద్యార్థులున్న బడులను విలీనం చేయండి

## –రాష్ట్రాలకు కేంద్రం సూచన



హైదరాబాద్, జూన్ 8 : 50 మందిలోపు విద్యార్థులున్న పాఠశాలలను విలీనం చేయాలని కేంద్ర విద్యా శాఖ ఆదేశించింది. శుక్రవారం వివిధ రాష్ట్రాల విద్యాశాఖ అధికారులతో కేంద్ర విద్యాశాఖ కార్యదర్శి సంజయ్‌కుమార్ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒడిశా, రాజస్థాన్‌లో 50 మందిలోపు విద్యార్థులున్న పాఠశాలలను ఇప్పటికే విలీనం చేశారని గుర్తుచేశారు. ఇలా చేయడం ద్వారా వనరులను సద్వినియోగం చేసుకోవడమే కాకుండా మెరుగైన విద్యను అందించిన వాళ్లమవుతామని తెలిపారు. మిగతా రాష్ట్రాలూ ఈ దిశగా కృషి చేయాలని సూచించారు. దీనిపై విద్యాశాఖ అధికారులు స్పందిస్తూ ఈ ప్రతిపాదనపై తాము ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపినట్టు సమాచారం.

రాష్ట్రంలో జీరో విద్యార్థులున్న పాఠశాలలు 1,739 ఉన్నాయి. ఒకే విద్యార్థి ఉన్న స్కూళ్లు 44, ఇద్దరు విద్యార్థులున్న స్కూళ్లు 92, ముగ్గురు విద్యార్థులున్న పాఠశాలలు 119 ఉన్నాయి. నలుగురు విద్యార్థులున్న స్కూళ్లు 178 ఉండగా, ఐదుగురు విద్యార్థులున్న స్కూళ్లు 265 ఉన్నాయి. ఆరుగురు విద్యార్థులున్న స్కూళ్లు 266, ఏడుగురు విద్యార్థులున్నవి 276, ఎనిమిది మంది విద్యార్థులున్న స్కూళ్లు 323, తొమ్మిది మంది ఉన్నవి 313, 10 మంది విద్యార్థులున్నవి 353 ఉన్నాయి. 0–10 మంది విద్యార్థులున్న పాఠశాలలు మొత్తం 3,968 ఉండటం గమనార్హం.

# లోక్‌సభ ఎన్నికల ఫలితాలు తప్పుగా అంచనా వేశాం.. ఒప్పుకున్న ప్రశాంత్ కిషోర్

న్యూఢిల్లీ, జూన్ 8 :రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ ఎట్టకేలకు తన మౌనాన్ని వీడారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలను తప్పుగా అంచనా వేసినట్లు ఒప్పుకున్నారు. తమ అంచనాలు 20 శాతం తప్పుగా ఉన్నాయని తెలిపారు. అయినప్పటికీ బీజేపీ ఓటు శాతం స్థిరంగా ఉందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి సుమారు 300 సీట్లు వస్తాయని, సొంత బలంతోనే మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని పోలింగ్‌కు ముందు ప్రశాంత్ కిషోర్ తెలిపారు. అయితే ఫలితాల్లో బీజేపీకి 240 సీట్లు వచ్చాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఒక టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రశాంత్ కిషోర్ మాట్లాడారు. 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై తన అంచనాలు తప్పని అంగీకరించారు. 'బీజేపీకి దాదాపు 300 సీట్లు వస్తాయని ఊహించాం. కానీ 240 సీట్లు వచ్చాయి. సుమారు 20 శాతం తప్పుగా అంచనా వేశాం' అని అన్నారు.కాగా, లోక్‌సభ ఎన్నికల్లో తన అంచనాలను ప్రశాంత్ కిషోర్ సమర్థించుకున్నారు. బీజేపీకి సీట్లు తగ్గినప్పటికీ సాధారణ ఓటరు సెంటిమెంట్ చాలా వరకు ఖచ్చితంగా ఉందని తెలిపారు. బీజేపీ ఓటు శాతం స్థిరంగా ఉందని చెప్పారు. 'బీజేపీ పట్ల ప్రజల్లో కొంత అసంతృప్తి, కోపం ఉంది. కానీ మోదీ పట్ల విస్తృతమైన శత్రుత్వం లేదు' అని అన్నారు. ప్రధాని మోదీ సంకీర్ణ ప్రభుత్వాన్ని సమర్థంగా నడపగలరని తెలిపారు. అలాగే మరో 20 నుంచి 30 ఏళ్ల వరకు దేశ రాజకీయాల్లో బీజేపీ ఆధిపత్యంలో ఉంటుందన్నారు.మరోవైపు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 99 సీట్లు సాధించినప్పటికీ ఆ పార్టీ పనితీరు అంతగా మెరుగుపడలేదని ప్రశాంత్ కిషోర్ విమర్శించారు. కాంగ్రెస్‌కు లేదా రాహుల్ గాంధీకి ఈ ఫలితాలు పునర్జీవంగా భావించకూడదని అన్నారు. 'కాంగ్రెస్ చరిత్రలో ఇది మూడో చెత్త ప్రదర్శన. గతం కంటే ఆ పార్టీ ఎక్కువ సీట్లు సాధించింది. వారికి అవకాశాలు ఉన్నాయని ప్రస్తుత పరిణామాలు సూచిస్తున్నాయి. కానీ పెద్దగా పునరాగమనం చెందలేదు' అని అన్నారు.

# రామోజీరావు మృతికి సంతాపం తెలిపిన పరికపల్లి

ఖమ్మం, జూన్ 8 :(నేటినిజం ప్రతినిధి): వామపక్ష విద్యార్థి ఉద్యమ నాయకుడు, జర్నలిజంలో లక్షలాదిమంది యువకులకు ఉపాధి కల్పించి, ప్రముఖ టీవీ ఛానల్, పత్రిక అధినేత, ప్రముఖ వ్యాపార వేత్త రామోజీరావు మరణం తీరని లోటని వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు.

# తన పెళ్లికి తమిళనాడు సీఎం స్టాలిన్‌ను ఆహ్వానించిన వరలక్ష్మి శరత్ కుమార్



న్యూఢిల్లీ, జూన్ 8 : కోలీవుడ్ నటి వరలక్ష్మి శరత్ కుమార్ త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతుంది. ముంబాయికి చెందిన వ్యాపారవేత్త, ఆర్ట్ గ్యాలరీల నిర్వాహకుడు నిచోలై సచ్‌దేవ్‌ని త్వరలోనే ఆమె వివాహం చేసుకోనున్నారు. ఈ ఏడాది మార్చిలో వీరిద్దరి ఎంగేజ్‌మెంట్ ఘనంగా జరిగింది. ఇక జూలైలో వీరి వివాహం జరుగనున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే పెళ్లి వేడుకలకు సిద్ధమవుతుంది. ఇక తమిళనాడులో ఉన్న పలువురు సినీ ప్రముఖులతో పాటు రాజకీయ ప్రముఖులను వరలక్ష్మి తమ పెళ్లికి ఆహ్వానిస్తుంది.

తాజాగా వరలక్ష్మి తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ దంపతులను కలిసి ఆహ్వానం అందించింది. శరత్‌కుమార్, రాధిక శరత్‌కుమార్‌లతో కలిసి స్టాలిన్ ఇంటికి వెళ్లిన వరలక్ష్మి తమ వివాహానికి రావాలని కోరింది. ఈ సందర్భంగా స్టాలిన్ నుంచి ఆశీస్సులు తీసుకుంది. కాగా ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు వైరల్ అవుతున్నాయి.

# బ్యాంక్ ఖాతాలకు రీ-కేవైసీ అప్ డేట్ చేయాలంటే.. ఈ టిప్స్ పాటిస్తే సరి..!

హైదరాబాద్, జూన్ 8 :ఇప్పుడు ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతా నిర్వహిస్తున్నారు. కుటుంబ భవిష్యత్ అవసరాల కోసం మ్యూచువల్ ఫండ్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, స్టాక్ మార్కెట్లు తదితర రూపాల్లో మదుపు చేస్తున్నారు. ఇప్పుడు బ్యాంకులో ఖాతా తెరవాలన్నా, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టాలన్నా ముందుగా బ్యాంకుకు, మ్యూచువల్ ఫండ్స్ మేనేజర్లకూ మీ కేవైసీ (నో యువర్ కస్టమర్) వివరాలు తప్పనిసరిగా తెలియజేయాలి. ఖాతాదారుల భద్రత పెంపుతోపాటు మోసాల నివారణకు బ్యాంకులు ఎప్పటికప్పుడు ఖాతాదారుల నుంచి కేవైసీ వివరాలు అప్ డేట్ చేయాలని కోరుతుంటాయి. పలువురు ఈ ప్రక్రియ ఎలా పూర్తి చేయాలో తెలియక ఇబ్బందుల పాలవుతుంటారు. అయితే ఆన్‌లైన్ లోనే బ్యాంకులు తమ ఖాతాదారులు కేవైసీ అప్ డేట్ చేసుకోవడానికి అనుమతి ఇస్తున్నాయి. ఖాతాదారులు తమ బ్యాంకు వెబ్ సైట్ లోకి వెళ్లి కేవైసీ అప్ డేట్ చేసుకోవచ్చు. అదేలాగో తెలుసుకుందామా..!దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు.. భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) ఆన్ లైన్ బ్యాంకింగ్‌లో లాగిన్ కావాలి. అటుపై 'మై అకౌంట్స్ అండ్ ప్రొఫైల్' సెక్షన్ కింద కనిపించే 'అప్ డేట్ కేవైసీ' మీద క్లిక్ చేయాలి. ఎస్బీఐ ఖాతాను ఎంపిక చేసి.. 'నెక్ట్స్' ఆప్షన్ క్లిక్ చేసి సంబంధిత డాక్యుమెంట్లను మీరు అప్ లోడ్ చేయాలి.

దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ బ్యాంక్.. హెచ్డీఎఫ్సీ బ్యాంక్ ఖాతాదారులు రీ–కేవైసీ ప్రక్రియను బ్యాంకు వెబ్‌సైట్‌లో తేలిగ్గా చేసేసుకోవచ్చు. పోర్టల్‌లో పర్సనల్ విభాగంలో ఈ–కేవైసీ లింక్ ఉంటుంది. లేదంటే బ్యాంకు వెబ్ సైట్ నుంచి సంబంధిత ఫామ్ డౌన్ లోడ్ చేసుకుని వివరాలు నింపి, సంబంధిత డాక్యుమెంట్ల జిరాక్స్ ప్రతులు కలిపి సమీపంలోని బ్యాంకు శాఖలో సమర్పిస్తే సరి.

# బ్రాహ్మణ కార్పోరేషన్ ఏర్పాటు చేయాలి

## - తెలంగాణ వైదిక బ్రాహ్మణ సంఘం డిమాండ్

హైదరాబాద్, జూన్ 08 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : నూతనంగా ఏర్పడిన




కాంగ్రెస్ ప్రభుత్వం బ్రాహ్మణ కార్పోరేషన్ ఏర్పాటు చేసి తగినన్ని నిధులు కేటాయించి, వైదికు బ్రాహ్మణ లకు న్యాయం చేయాలని తెలంగాణ వైదిక బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. శనివారం హైదర్ గూడ ఎన్ఎస్ఎస్ లో ఏర్పాటు చేసిన విలేకంల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు మురుకుంట్ల రాజేశ్వరశర్మ. ప్రధాన కార్యదర్శి ఉప్పల బాలసు బ్రహ్మణ్యం, మహిళా విభాగం కన్వీనర్ అర్పితలతో కలసి ఆయన మాట్లాడారు. లోక కళ్యాణం కోసం పాటుపడే వైదిక బ్రాహ్మణులు(అర్చకులు)లకు గత ప్రభుత్వం అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై మంత్రులు కొండా సురేఖ, దుదిళ్ల శ్రీధర్ బాబులకు విజ్ఞప్తి చేశామని, త్వరలో సీఎం రేవంత్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేస్తామని తెలిపారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ వల్ల కొంత మందికి మాత్రమే న్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రాహ్మణ శాఖ పరంగా జన గణన చేవట్టాలని, అర్చక పురోహితుల రక్షణ కోసం, ధార్మిక పరిషత్ ఏర్పాటు చేయాలన్నారు. కార్పోరేషన్ ఏర్పాటులో ఛైర్మన్, డైరెక్టర్స్ లో ఐఎఎస్, ఐపిఎస్ అధికారులను నియమించకుండా క్షేత్ర స్థాయిలో తమ సంఘం నాయకులను నియమించాలని కోరారు. దేవాలయా ల్లో దూప, దీప నైవేద్య పథకాలను ప్రక్షాళన చేయాలన్నారు. బ్రాహ్మణుల పై జరుగుతున్న దాడులను అపాలని, వీరి రక్షణ కోసం ప్రత్యేక చట్టం రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం వైదికులను చాలా ఇబ్బందులకు గురిచేసిందని, ముఖ్య ంగా కరోనా సమయంలో బెదిరింపుల కు కూడా పాల్పడ్డారని ఆరోపించారు. ఈ సమావేశంలో నారాయణం చక్రవర్తి శర్మ, వేమవరపు వెంకటర మణ, చిన్నయ్య శర్మ, మాడా పాపయ్యశర్మ, కేశవనాథశర్మ, తోట ప్రకాశ్ శర్మ పాల్గొన్నారు.

# ఆరోగ్యశ్రీలో అదనంగా 65 కొత్త చికిత్స విధానాలు అమలు

హైదరాబాద్, జూన్ 8 : ఆరోగ్య శ్రీ పథకంలో అదనంగా 65 అధునాతన చికిత్స విధానాలను రాష్ట్ర ప్రభుత్వం చేర్చింది. వీటితో పాటు ఇప్పటివరకు అందుబాటులో ఉన్న వాటిలో 1,375 విధానాలకు ప్యాకేజీ ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. వీటికి సంబంధించి రూ.497.29 కోట్లను విడుదల చేస్తూ ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు.

ఆరోగ్య శ్రీ పథకం కింద కొత్త చికిత్స విధానాలు, ప్రస్తుత పథకాల ఆర్థిక సవరణకు సంబంధించి రాష్ట్ర సచివాలయంలో మంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇప్పటివరకు ఆరోగ్యశ్రీలో అమలులో లేని యాంజియోగ్రామ్, పార్కిన్ సన్, వెన్నుపూసకు సంబంధించిన 65 అధునాతన చికిత్స విధానాలను ఇక నుంచి ఆరోగ్యశ్రీలో అమలు చేయాలని నిర్ణయించారు. అలాగే ఆరోగ్యశ్రీలో 1672 చికిత్స విధానాలు అందుబాటులో ఉండగా.. వాటిలో 1375 విధానాలకు ప్యాకేజీ ధరలు పెంచాలని వైద్య నిపుణుల సూచనల మేరకు డిప్యూటీ సీఎం నిర్ణయం తీసుకున్నారు.

# ఐఎన్ఎస్ రాజాలిలో నావికాదళ పైలట్ల పాసింగ్ అవుట్ పరేడ్

న్యూఢిల్లీ, జూన్ 8 :102వ హెలికాప్టర్ కన్వర్షన్ కోర్స్ (ఊఅల) గ్రాడ్యుయేషన్ మరియు 04వ బేసిక్ హెలికాప్టర్ కన్వర్షన్ కోర్స్ (ఃఊఅల) యొక్క దశ ఎ శిక్షణను పూర్తి చేయడం కోసం 07 జూన్ 24న పాసింగ్ అవుట్ పరేడ్ జరిగింది - ఎఔా రాజాలి, తమిళనాడు, అరక్కోణం, నావల్ ఎయిర్ స్టేషన్‌లో. .

03 ఃఊఅలకి చెందిన ముగ్గురు అధికారులతో సహా 21 మంది అధికారులకు ఈస్టర్న్ నేవల్ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ ప్రతిష్ఠాత్మకమైన "గోల్డెన్ వింగ్స్" ప్రదానం చేశారు. అదనంగా, 04 బేసిక్ కన్వర్షన్ కోర్సు (ఃఅల) యొక్క ముగ్గురు అధికారులు వారి దశ ? (ఎ) శిక్షణను విజయవంతంగా పూర్తి చేసారు.



భారత నావికాదళానికి చెందిన హెలికాప్టర్ పైలట్‌ల అల్మా మేటర్ అయిన ఇండియన్ నేవల్ ఎయిర్ స్క్వాడ్రన్ 561లో కఠినమైన ఫ్లయింగ్ మరియు గ్రౌండ్ ట్రైనింగ్‌తో కూడిన ఇంటెన్సివ్ 22 వారాల శిక్షణా కార్యక్రమం విజయవంతమైన ముగింపుగా పాసింగ్ అవుట్ పరేడ్ గుర్తించబడింది.

లింగ సముదాయానికి మరియు మహిళలకు కెరీర్ అవకాశాలను విస్తరించడానికి భారత నౌకాదళం యొక్క నిబద్ధతను హైలైట్ చేస్తూ, ూఔబి అనామిక ః రాజీవ్ 'ఫస్ట్ ఉమెన్ నేవల్ హెలికాప్టర్ పైలట్' గా పట్టభద్రుడై చరిత్ర సృష్టించారు. లడఖ్ కేంద్రపాలిత ప్రాంతం నుండి మొదటి కమిషన్డ్ నేవల్ ఆఫీసర్ లెఫ్టినెంట్ జమ్యాంగ్ త్సెవాంగ్ కూడా అర్హత కలిగిన హెలికాప్టర్ పైలట్‌గా విజయవంతంగా పట్టభద్రుడయ్యాడు.

ఫ్లయింగ్‌లో ఆర్డర్ ఆఫ్ మెరిట్‌లో మొదటి స్థానంలో నిలిచిన ట్రైనీ పైలట్‌కు FOCinC, ఈస్టర్న్ నేవల్ కమాండ్ రోలింగ్ ట్రోఫీని లెఫ్టినెంట్ గురుకీరత్ రాజ్‌పుత్‌కు అందించారు. గ్రౌండ్ సబ్జెక్ట్‌లలో ఆర్డర్ ఆఫ్ మెరిట్‌లో మొదటి స్థానంలో నిలిచినందుకు సబ్ లెఫ్టినెంట్ కుంటే మెమోరియల్ బుక్ ప్రైజ్ లెఫ్టినెంట్ నితిన్ శరణ్ చతుర్వేదికి లభించింది. ఓవరాల్ ఆర్డర్ ఆఫ్ మెరిట్‌లో మొదటిగా నిలిచిన కేరళ గవర్నర్ రోలింగ్ ట్రోఫీ లెఫ్టినెంట్ దీపక్ గుప్తాకు లభించింది.

ఐదు దశాబ్దాలకు పైగా విస్తరించిన దాని గొప్ప వారసత్వంలో, హెలికాప్టర్ ట్రైనింగ్ స్కూల్ ఇండియన్ నేవీ, ఇండియన్ కోస్ట్ గార్డ్ మరియు స్నేహపూర్వక విదేశీ దేశాలకు చెందిన 849 మంది పైలట్‌లకు శిక్షణ ఇచ్చింది. హెలికాప్టర్ ట్రైనింగ్ స్కూల్ INS రాజాలి, అరక్కోణంలో ప్రస్తుతం కమోడోర్ కపిల్ మెహతా ఆధ్వర్యంలో ఉంది మరియు హెలికాప్టర్ ట్రైనింగ్ స్కూల్ కమాండర్ అర్చేష్ ఆధ్వర్యంలో ఉంది.

స్క్వాడ్రన్ యొక్క సురక్షితమైన మరియు అనుకూలమైన శిక్షణా వాతావరణంతో పాటు ఖచ్చితమైన ప్రణాళిక మరియు అమలు 'సమయానికి, ప్రతిసారీ' కోర్సును పూర్తి చేయడానికి నిర్ధారిస్తుంది. 102 హెచ్‌సిసికి చెందిన కొత్తగా అర్హత పొందిన పైలట్‌లు భారత నావికాదళంలోని వివిధ ఫ్రంట్-లైన్ కార్యాచరణ యూనిట్‌లకు నియమితులవుతారు, అక్కడ వారు నిఘా, నిఘా, శోధన మరియు రెస్క్యూ మరియు యాంటీ-పైరసీ వంటి విభిన్న మిషన్‌లను తీసుకుంటారు. 04 ఃఊఅల యొక్క అధికారులు దశ ? (ఎ) శిక్షణను విజయవంతంగా పూర్తి చేసి, హెలికాప్టర్ శిక్షణా పాఠశాలలో స్టేజ్ శిక్షణ కోసం కొనసాగించబడతారు.

# గాంబియాలోని సివిల్ సర్వెంట్ల కోసం రెండు వారాల 4వ మిడ్-కెరీర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ న్యూ ఢిల్లీలో విజయవంతంగా పూర్తయింది



న్యూఢిల్లీ, జూన్ 8 :భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఓఇం) భాగస్వామ్యంతో గాంబియాలోని మిడ్-లెవల్ సివిల్ సర్వెంట్ల కోసం రెండు వారాల 4వ మిడ్-కెరీర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ 7 జూన్ 2024న న్యూఢిల్లీలో విజయవంతంగా పూర్తయింది. ఈ కార్యక్రమానికి గాంబియాలోని కీలక మంత్రిత్వ శాఖలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 30 మంది అధికారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమం 2019-24 పర్సనల్ అడ్మినిస్ట్రేషన్ మరియు గవర్నెన్స్‌పై భారతదేశ గాంబియా అవగాహన ఒప్పందాన్ని విజయవంతంగా అమలు చేసింది.

స్వాగత సెషన్‌లో, అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ అండ్ పబ్లిక్ గ్రీవెన్స్ డిపార్ట్‌మెంట్ (ఆంఖీఖఉ) సెక్రటరీ మరియు నేషనల్ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ డైరెక్టర్ జనరల్ అయిన శ్రీ ఎ. శ్రీనివాస్, ఎయా ప్రొసీడింగ్‌లకు అధ్యక్షత వహించి, పాల్గొనేవారిని అభినందించారు. పర్సనల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ గవర్నెన్స్ 2019-24పై భారత్-గాంబియా ఐదేళ్ల అవగాహన ఒప్పందాన్ని విజయవంతంగా అమలు చేసినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తన ప్రసంగంలో, డిజిటల్ పరివర్తన ఆర్థిక వృద్ధిని ఎలా నడిపిస్తుందో, సర్వీస్ డెలివరీని మెరుగుపరుస్తుంది మరియు సమ్మిళిత అభివృద్ధిని ఎలా ప్రోత్సహిస్తుందో అతను నొక్కి చెప్పాడు. శ్రీ శ్రీనివాస్ పాలనా ప్రక్రియలను క్రమబద్ధీకరించడానికి, పారదర్శకతను మెరుగుపరచడానికి మరియు ప్రభుత్వ పరిపాలనలో సామర్థ్యాన్ని పెంచడానికి డిజిటల్ సాధనాలు మరియు సాంకేతికతలను ఉపయోగించుకోవడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. డిజిటల్ విభజనను తగ్గించడానికి డిజిటల్ కార్యక్రమాల యొక్క సంభావ్యతను ఆయన చర్చించారు, తద్వారా సాంకేతిక పురోగతి యొక్క ప్రయోజనాలు సమాజంలోని అన్ని వర్గాలకు, ముఖ్యంగా వెనుకబడిన మరియు అట్టడుగు వర్గాలకు చేరుకునేలా నిర్ధారిస్తుంది.

శ్రీ . శ్రీనివాన్, సెక్రటరీ, మరియు డైరెక్టర్ జనరల్, గుడ్ గవర్నెన్స్, నేషనల్ సెంటర్ వాల్డిక్టరీ సెషన్‌లో ప్రసంగించారు

శ్రీ వి.శ్రీనివాస్, డిజి ఎన్‌సిజిజి మాట్లాడుతూ, "రెండు దేశాలలో పాలనను మెరుగుపరచడానికి పరస్పరం జ్ఞానాన్ని మార్పిడి చేసుకోవడం చాలా ముఖ్యం." గాంబియాలో భారతదేశం యొక్క సుపరిపాలన నమూనాలను అవలంబించడం సామాజిక అభివృద్ధిని ఎలా నడిపించగలదో, ఇరు దేశాల వారి పురోగతికి ప్రయోజనం చేకూరుస్తుందని కూడా ఆయన నొక్కిచెప్పారు.

కార్యక్రమంలో, గాంబియాకు చెందిన సివిల్ సర్వెంట్ అధికారులు డిజిటల్ గాంబియా, గాంబియాలో మహిళా సాధికారత మరియు గాంబియాలోని సాంఘిక సంక్షేమ పథకం వంటి అంశాలపై ప్రదర్శనలను సిద్ధం చేశారు. ఈ ప్రెజెంటేషన్లు ప్రతినిధులచే ఎంతో ప్రశంసించబడ్డాయి. మహిళా సాధికారతపై అత్యుత్తమ ప్రదర్శన చేసినందుకు గ్రూప్ టూ మొదటి స్థానంలో నిలిచింది.

అనుభవం మరియు జ్ఞాన మార్పిడిని సులభతరం చేయడంలో ఎన్‌సిజిజి శిక్షణా కార్యక్రమం కీలక పాత్ర పోషించినందుకు ఆయన ఎక్స్‌లెన్సీ, మిస్టర్ ముస్తఫా జవారా ప్రశంసించారు.

ఈ విలువైన అవకాశాన్ని కల్పించిన ఎన్‌సిజిజికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో ఇటువంటి కార్యక్రమాల ప్రాముఖ్యతను శ్రీ జవారా హైలైట్ చేశారు. భారత పాలనా నమూనాలను అవలంబించడం మరియు నేర్చుకోవడం ద్వారా గాంబియాలో గణనీయమైన మరియు సానుకూల అభివృద్ధి ఫలితాలకు దారితీస్తుందని, మెరుగైన పాలన మరియు మెరుగైన ప్రజాసేవ డెలివరీని పెంపొందించవచ్చని ఆయన నొక్కిచెప్పారు.

ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ మరియు కోర్స్ కోఆర్డినేటర్ అయిన డాక్టర్ ంఖ సింగ్ శిక్షణా కార్యక్రమములోని ముఖ్యాంశాలను పంచుకున్నారు. అధికారుల కోసం రూపొందించిన కోర్సు, మార్గదర్శకులతో పరస్పర చర్యలతో పాటు గాంబియా నుండి ఔఅఉఉకి అమూల్యమైన అభ్యాస అనుభవాలను ఎలా అందించిందో ఆయన నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమాలు జ్ఞానాన్ని పంచుకోవడమే కాకుండా అధికారులతో పరస్పర చర్చకు అవకాశాలను సృష్టిస్తాయని, విలువైన స్నేహాన్ని పెంపొందించుకోవాలని ఆయన అన్నారు. భవిష్యత్తులో గాంబియా నుండి మరింత మంది అధికారులకు ఆతిథ్యం ఇవ్వాలని ఔఅఉఉ ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

నేషనల్ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్, అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ అండ్ పబ్లిక్ గ్రీవెన్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్ అండ్ పెన్షన్స్ మినిస్ట్రీ, భారత ప్రభుత్వం కింద ఒక స్వయంప్రతిపత్త సంస్థ. NCGG యొక్క ప్రయత్నాలు భారతీయ తత్వశాస్త్రం అయిన 'వసుధైవ కుటుంబం' అంటే "ప్రపంచం ఒకటే కుటుంబం"తో సమలేఖనమైంది మరియు ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడం మరియు ఇతర దేశాలతో సహకారాన్ని పెంపొందించడంపై ఉద్ఘాటిస్తుంది.

NCGG MEA, NCGG భాగస్వామ్యంతో 17 దేశాల పౌర సేవకులకు విజయవంతంగా శిక్షణనిచ్చింది. బంగ్లాదేశ్, మాల్దీవులు, కెన్యా, టాంజానియా, ట్యునీషియా, సీ షెల్స్, గాంబియా, శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్, లావోస్, వియత్నాం, నేపాల్ భూటాన్, మయన్మార్, ఇథియోపియా, ఎరిట్రియా మరియు కంబోడియా సివిల్ బిల్డింగ్ రంగంలో సహకారం కోసం అనేక దేశాల నుండి అభ్యర్థనలు అందుతున్నాయి. సేవకులు. శ్రీమతి ప్రిస్కా పాలీ మాథ్యూ, కన్సల్టెంట్ మరియు చీఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, డాక్టర్ హిమాషి రస్తోగి, అసోసియేట్ ప్రొఫెసర్ మరియు డాక్టర్ గజాలా హసన్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్‌సిజిజి కూడా సెషన్‌లో పాల్గొన్నారు.

# డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడమీ నుండి 154 రెగ్యులర్ కోర్సు & 137 టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సు యొక్క 394 ఆఫీసర్ క్యాడెట్లు ఉత్తీర్ణులయ్యారు

న్యూఢిల్లీ, జూన్ 8 :154 రెగ్యులర్ కోర్సులు మరియు 137 టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సులకు చెందిన మొత్తం 394 మంది ఆఫీసర్ క్యాడెట్‌లు, 10 స్నేహపూర్వక దేశాల నుండి 39 మందితో సహా, ఇండియన్ మిలిటరీ అకాడమీ (ఎఓం), డెహ్రాడూన్, ఉత్తరాఖండ్ పోర్టల్‌ల నుండి జూన్ 08, 2024న ఉత్తీర్ణులయ్యారు. ఆఫీసర్ క్యాడెట్‌లు ప్రదర్శించబడ్డాయి. ఉత్సాహం, పరిపూర్ణత మరియు గర్వంతో 'సారే జహాన్ సే అచ్చా' మరియు 'కదమ్ కదమ్ బఢయే జా' మిలిటరీ ట్యూన్‌లకు అద్భుతమైన ప్రదర్శనను అందించింది.

జనరల్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్, నార్తర్న్ కమాండ్ లెఫ్టినెంట్ జనరల్ ఓఎ సుచీంద్ర కుమార్ పాసింగ్ అవుట్ పరేడ్‌ను సమీక్షించారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న అధికారి క్యాడెట్లను ఆయన అభినందించారు. యువ అధికారి క్యాడెట్‌ల శిక్షణ మరియు క్రమశిక్షణ యొక్క ఉన్నత ప్రమాణాలను సూచిస్తూ, అద్భుతమైన పరేడ్‌తో పాటు స్ఫుటమైన ఉ సిన్క్రొనైజ్డ్ డ్రిల్ కదలికల కోసం అతను వారిని మరియు బోధకులను అభినందించాడు.

"పెరేడ్ అనేది మీ శిక్షణకు పరాకాష్ట మరియు వృత్తిపరమైన వృత్తిని ప్రారంభించడం. ఇది మీ జీవితకాలంలో ఒక్కసారైనా వచ్చే క్షణం మరియు ఇది అన్ని భవిష్యత్ ప్రయత్నాలకు ప్రేరణగా ఉంటుంది. మీరు తీసుకునే ప్రతిజ్ఞ మరియు మీ జాతికి మీరు చేసే ప్రతిజ్ఞలు పవిత్రమైనవి మరియు ఇకపై మీ కట్టుబాట్లకు ముందు ఉంటాయి. ఈ రోజు మీరు గర్వంగా మరియు బలంగా నిలబడటం మీరు అధికారిగా మారడానికి పడిన శ్రమకు మరియు శ్రమకు నిదర్శనం. ఎఓం అనేది ఒక ఉన్నత సంస్థ, అది మీ సామర్థ్యాన్ని ఉపయోగించుకుంది మరియు అధికారికి తగిన అన్ని విజ్ఞానం మరియు లక్షణాలతో మీకు సన్నద్ధమైంది, "అని సమీక్ష అధికారి అధికారి క్యాడెట్‌లకు చెప్పారు.

భారత సైన్యం ప్రపంచంలోనే అత్యుత్తమ సైనికులను కలిగి ఉన్నందుకు గర్వపడుతుందని, వీరు పోరాట జ్ఞానాన్ని మరియు సంవత్సరాల తరబడి కార్యాచరణ అనుభవం కలిగి ఉన్నారని సమీక్ష అధికారి పునరుద్ఘాటించారు. అధికారి క్యాడెట్‌లను ఎల్లప్పుడూ గౌరవంగా నడిపించాలని ఆయన కోరారు; విశిష్టతతో సేవ చేయండి; మరియు కర్తవ్యం పట్ల తిరుగులేని నిబద్ధతతో చుట్టుపక్కల వారికి స్ఫూర్తినిస్తుంది.

వేగంగా మారుతున్న పోరాట డైనమిక్స్‌పై, సాంకేతిక పరివర్తన ఆధునిక యుద్ధాల స్వభావాన్ని నిరంతరం ప్రభావితం చేస్తోందని సమీక్ష అధికారి పేర్కొన్నారు. యుద్ధంలో స్పేస్, సైబర్ ఉ కాగ్నిటివ్ డొమైన్‌ల వినియోగం సమకాలీన వాస్తవాలు మరియు సమాచార యుద్ధం, డ్రోన్‌లు, స్వయంప్రతిపత్త వ్యవస్థలు, ఎలక్ట్రో మాగ్నెటిక్ స్పెక్ట్రమ్ దోపిడీ మరియు మ్యాన్-మెషీన్ టీమింగ్ కొత్త సాధారణమని ఆయన నొక్కి చెప్పారు. విఘాతం కలిగించే సాంకేతికతలను ఉపయోగించడంతో ఈ డొమైన్‌లు రోజురోజుకు మెరుగుపడుతున్నాయని, తద్వారా యుద్ధాల సంక్లిష్టతలను పెంచుతున్నాయని ఆయన అన్నారు. ఆలోచనలు, మేధస్సు మరియు ఆవిష్కరణల యుద్ధాలుగా అభివర్ణిస్తూ, ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని మరియు ముందంజలో ఉండాలని ఆయన అధికారి క్యాడెట్‌లను కోరారు. "యంత్రం వెనుక ఉన్న వ్యక్తి చాలా ముఖ్యమైనది అనే సామెతను గుర్తుంచుకోండి. శారీరక దృఢత్వం, మానసిక చురుకుదనం, క్రిటికల్ థింకింగ్, సాంకేతిక నైపుణ్యం మరియు ద్రవీభవన పరిస్థితులకు వేగంగా స్పందించడం మీ విజయానికి కీలకం, "అని అతను చెప్పాడు.

# ఇప్పుడు కాకపోయినా.. భవిష్యత్తులో ఇండియా కూటమి ప్రభుత్వం: మమతా బెనర్జీ

కోల్‌కతా, జూన్ 8 : ఇప్పుడు కాకపోయినా భవిష్యత్తులో ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పడుతుందని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అన్నారు. ప్రజలు మార్పు కోరుకున్నప్పటికీ బీజేపీ అప్రజాస్వామికంగా, అక్రమంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తోందని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి విమర్శించారు. కొత్తగా ఎన్నికైన టీఎంసీ ఎంపీలు, పార్టీ సీనియర్ నేతలతో మమతా బెనర్జీ శనివారం సమావేశమయ్యారు. లోక్‌సభలో పార్టీ అనుసరించే వ్యూహంపై చర్చించారు. ఈ సందర్భంగా నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్డీయే) ప్రభుత్వం మనుగడపై సందేహాన్ని ఆమె వ్యక్తం చేశారు. ఏం జరుగుతుందో అన్నది తమ పార్టీ ఎదురు చూస్తుందని, వేచి ఉంటుందని అన్నారు.

కాగా, దేశానికి మార్పు అవసరమని, దేశం మార్పు కోరుకుంటోందని మమతా బెనర్జీ తెలిపారు. లోక్‌సభ ఎన్నికల తీర్పు ఈ మార్పు కోసమే అని అన్నారు. 'మేం వేచి ఉన్నాం. పరిస్థితిని గమనిస్తున్నాం. ఎన్నికల తీర్పు మోదీకి వ్యతిరేకంగా ఉంది. కాబట్టి ఆయన ఈసారి ప్రధాని కాకూడదు. వేరొకరు ప్రధాని పదవి చేపట్టేందుకు అనుమతించాలి' అని మీడియాతో అన్నారు.

మరోవైపు బీజేపీ అప్రజాస్వామికంగా, చట్టవిరుద్ధంగా కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తోందని మమతా బెనర్జీ విమర్శించారు. అందుకే కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారోత్సవానికి తమ పార్టీ హాజరుకాదని తెలిపారు. 'ఈ రోజు ఇండియా బ్లాక్ ప్రభుత్వం ఏర్పడకపోవచ్చు. కానీ రేపు అది సాధ్యం కావచ్చు. మరికొంత కాలం వేచి ఉందాం' అని అన్నారు. కేంద్రంలో ఏర్పడే అస్థిర, బలహీన ప్రభుత్వం అధికారం కోల్పోతే తాను సంతోషిస్తానని వ్యాఖ్యానించారు.

# దుబాయ్-కాలికట్ విమానం కొచ్చికి తరలింపు.. కారణమిదేనా..?!

దుబాయ్ నుంచి కేరళలోని కాలికట్‌కు వస్తున్న ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానాన్ని కొన్ని గంటల పాటు కోచికి తరలించారు. కోజికోడ్‌లో అననుకూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో శనివారం కాలికట్‌లో ల్యాండ్ కావాల్సిన విమానాన్ని కోజికోడ్‌కు మళ్లించారు. శనివారం తెల్లవారుజామున 2.47 గంటలకు కొచి విమానాశ్రయంలో ల్యాండయింది. తిరిగి వాతావరణ పరిస్థితులు కుదుట పడిన తర్వాత దాదాపు ఏడు గంటలకు అంటే, ఉదయం 9.30 గంటలకు కొచి నుంచి కాలికట్‌కు విమానం టేకాఫ్ అయింది. ఈ విమానంలో 173 మంది ప్రయాణికులు ఉన్నారు.

గత నెలలోనూ బెంగళూరు నుంచి కోచికి వస్తున్న ఎయిర్ ఇండియా ఎక్స్ ప్రెస్ విమానాన్ని అత్యవసరంగా దించేశారు. తొలుత బెంగళూరులో సదరు విమానం ఇంజిన్లలో ఒక దాంట్లో మంటలు వచ్చినట్లు గుర్తించడంతో ప్రయాణికులందరినీ సురక్షితంగా దింపేశారని, ఎవరికీ గాయాలు కాలేదని ఎయిర్ ఇండియా ఎక్స్ ప్రెస్ ఓ ప్రకటనలో తెలిపింది.

# నా వారసుడ్ని ప్రజలే నిర్ణయిస్తారు: నవీన్ పట్నాయక్

న్యూఢిల్లీ, జూన్ 8 : తన రాజకీయ వారసుడు వీకే పాండియన్ కాదని ఒడిశా తాజా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ (ఔజీలవవని ఖజీబినిజీతిని) తెలిపారు. తన వారసుడు ఎవరో అన్నది ఒడిశా ప్రజలు నిర్ణయిస్తారని బీజూ జనతా దళ్ (బీజేపీ) చీఫ్ అన్నారు. అయితే తమిళనాడుకు చెందిన ప్రభుత్వ బ్యూరోక్రాట్ నుంచి రాజకీయవేత్తగా మారిన తన ప్రధాన అనుచరుడ్ని ఆయన సమర్థించారు. పాండియన్ తనను శాసిస్తున్నట్లు బీజేపీ చేసిన ఆరోపణలను నవీన్ పట్నాయక్ ఖండించారు. పార్టీ సభ్యుడైన పాండియన్‌పై విమర్శలు దురదృష్టకరమని అన్నారు. 'ఆయన (పాండియన్) పార్టీలో చేరాడు. ఏ పదవిని నిర్వహించలేదు. ఏ ఎన్నికల్లో పోటీ చేయలేదు. అధికారిగా గత పదేళ్లలో వివిధ రంగాల్లో, రెండు తుఫానులు, కరోనా మహమ్మారి సమయంలో అద్భుతంగా పని చేసాడు. పదవీ విమరణ తర్వాత బీజేడీలో చేరాడు. పార్టీ కోసం కూడా అద్భుతంగా పని చేయడం ద్వారా ఎక్కువగా సహకరించాడు. అతడు నీతి, నిజాయితీ గల వ్యక్తి. దానిని గుర్తుంచుకోవాలి' అని అన్నారు.

కాగా, ఒడిశా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీజూ జనతా దళ్ (బీజేడీ) ఘోర పరాజయం పొందింది. 147 అసెంబ్లీ స్థానాలకుగాను బీజేపీ 78 సీట్లు గెలుచుకోగా బీజేడీ 51 సీట్లలో విజయం సాధించింది. కాంగ్రెస్ 14 స్థానాల్లో గెలిచింది. అలాగే 21 లోక్‌సభ స్థానాలకు 20 బీజేపీ దక్కించుకుంది. బీజేడీ ఒక్క సీటుకే పరిమితమైంది. ఈ ఫలితాల నేపథ్యంలో వరుసగా ఐదుసార్లు సీఎంగా ఉన్న నవీన్ పట్నాయక్ ఆరోసారి ఆ అవకాశాన్ని కోల్పోయారు.





భాషా సాంస్కృతికశాఖ, తెలంగాణ ప్రభుత్వం సౌజన్యంతో

అమరవాది ఫౌండేషన్

సాహిత్య, సాంస్కృతిక సంస్థ నిర్వహణలో

శ్రీమతి అమరవాది హైమవతీ-డా.ఎ.సి.ఎం.ఎల్. ప్రసాద్ సాహిత్య పురస్కారం

పురస్కార గ్రహీత : ఆచార్య సి. మృణాళిని

డా.ఎ.సి.ఎం.ఎల్. ప్రసాద్-శ్రీమతి హైమవతి బాల సాహిత్య పురస్కారం

పురస్కార గ్రహీత : శ్రీ గరిపెల్లి అశోక్

డా. అమరవాది నీరజ

బాలల కథలు 'ఏడు రంగుల జండా' పుస్తకావిష్కరణ

13 జూన్, 2024 గురువారం, సాయంత్రం 6 గంటలకు,
సమావేశ మందిరం, మొదటి అంతస్తు, రవీంద్ర భారతి, హైదరాబాద్

ముఖ్య అతిథి

శ్రీ మణికొండ వేదకుమార్

సంపాదకులు, బాలచెలిమి బాల వికాస పత్రిక & దక్కన్ లాండ్
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమి

అధ్యక్షులు

డా. పత్తిపాక మోహన్

దక్షిణ ప్రాంత అధికారి, నేషనల్ బుక్ ట్రస్ట్, భారత ప్రభుత్వం

విశిష్ట అతిథులు

డా. జుర్రు చెన్నయ్య

కార్యదర్శి, తెలంగాణ సారస్వత పరిషత్తు

శ్రీ చొక్కాపు వెంకటరమణ

సాహిత్య అకాడమి బాల సాహిత్య పురస్కార గ్రహీత

అమరవాది ఫౌండేషన్ పక్షాన

| డా. అమరవాది నీరజ | ఎ. సీతారాం | చింతకింది మాల్యా | డా. హారిక చెరుకుపల్లి |
|---|---|---|---|
| అధ్యక్షులు | ఉపాధ్యక్షులు | ప్రధాన కార్యదర్శి | నిర్వాహక కార్యదర్శి |

# రామోజీ రావు ఎంతోమందికి మార్గదర్శి

## -బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్

## -రామోజీరావు మృతి పట్ల సంతాపం

కరీంనగర్, జూన్ 8 : (నేటినిజం ప్రతినిధి) ఈనాడు గ్రూపు సంస్థల అధినేత, పద్మవిభూషణ్ రామోజీరావు మరణం అత్యంత బాధాకరం అని, పత్రికా రంగంలో తనదైన పంథాతో చెరగని ముద్ర వేయడమే కాకుండా విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిన గొప్ప వ్యక్తి రామోజీరావు అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. రామోజీ రావు మృతి పట్ల బండి సంజయ్ సంతాపం తెలిపారు. రామోజీరావునిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించేవరకు వరకు విశ్రమించని యోధుడని, మీడియా, వ్యాపార, సినీ రంగాల్లో అత్యద్భుతంగా రాణిస్తూ ఎంతో మందికి 'మార్గదర్శి'గా నిలిచిన మహనీయుడని కొనియాడారు.

మీడియా మొఘల్ గా పేరుగాంచిన రామోజీరావుని కలిసినప్పుడల్లా ఎన్నో గొప్ప విషయాలు చెప్పేవారని, రామోజీ ఫిల్మ్ సిటీలో ఆయనతో కలిసి 'చంద్రయాన్'ను వీక్షించడం మర్చిపోలేని అనుభూతి అన్నారు. తనలాంటి ఎందరికో మార్గదర్శిగా నిలిచిన గొప్ప వ్యక్తి రామోజీరావు అని, ప్రపంచంలోనే అత్యద్భుతమైన రామోజీ ఫిల్మ్ సిటీని నిర్మించి తెలుగు రాష్ట్రాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని గుర్తుచేశారు. మాతృభాష పరిరక్షణకు నిరంతరం శ్రమించిన గొప్ప వ్యక్తి అని, మీడియా, చిట్ ఫండ్, ఫిల్మ్ సిటీ సహా అడుగుపెట్టిన ప్రతి వ్యాపార రంగంలోనూ అద్భుతంగా రాణిస్తూ తనదైన ముద్రవేసిన రామోజీరావు ప్రత్యక్షంగా వేలాది మందికి, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి కల్పించిన గొప్ప వ్యక్తి రామోజీరావు అని, అలాంటి వ్యక్తి మరణం తీరనిలోటని అన్నారు.

రామోజీరావు ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ముందుకుసాగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని ప్రకటనలో పేర్కొన్నారు.

# అనారోగ్యంతో మృతి చెందిన పోలీస్ జాగిలం రాజా పుష్పగుచ్చాలు

## వేసి నివాళులర్పించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



రాజన్న సిరిసిల్ల, జూన్ 8 :(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా హెడ్ క్వార్టర్ లో పోలీస్ జాగిలం (లాబ్రడార్ రిట్రీవర్) సంతతికి చెందిన రాజా , వయస్సు 15 సంవత్సరాలు అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో పోలీస్ అధికారులు , పోలీస్ జాగిలం హ్యాండ్లర్ మల్లేశం తో కలసి రాజా పై పుష్పగుచ్చాలు వేసి ఘనంగా నివాళులర్పించి రాజా సేవలు మరువలేనివని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సంతాపాన్ని వ్యక్తం చేశారు .

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాజా గత 14 సంవత్సరాల నుండి జిల్లాలో వివిపి. వివిఐపిలు సందర్శించినప్పుడు (ఆర్ఓపి) స్నిపర్, బాంబులు, మందు పాత్రలు, గుర్తించడంలో చాకచక్యంగా వ్యవహరించి విధులు నిర్వహించేదని కొనియాడారు. 2010 సంవత్సరంలో రాజా తన హ్యాండ్లర్ మల్లేశం తో పాటుగా ఎనిమిది నెలల పాటు ఐ ఐ టి ఏ ,మొయినాబాద్ నందు బేసిక్ ట్రైనింగ్ పూర్తి చేసుకుని జిల్లాకు కేటాయించగా జిల్లాలో గత 14 సంవత్సరాలుగా సేవలందించిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ లు యాదగిరి, మాధుకర్, రమేష్, రాజా హ్యాండ్లర్ మల్లేశం, డాగ్ స్క్వాడ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పీడిత వర్గ విముక్తి బావుటా ఎర్రజెండా

# మతోన్మాద కార్పొరేట్లకు వ్యతిరేకంగా పోరాడాలి

## -సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం డి అబ్బాస్




రాజన్న సిరిసిల్ల, జూన్ 8 :(నేటినిజం ప్రతినిధి): కష్టజీవుల రక్త మాంసాలు పీల్చుకుతినే కార్పొరేట్ల తరఫున మతోన్మాద బీజేపీ నిలుస్తుందని మతోన్మాదానికి కార్పొరేట్లకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాన్ని నిర్మించడం నేడు కీలక కర్తవ్యం అని ఆపీడిత వర్గ విముక్తి బాగుట ఎర్రజెండా మాత్రమేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి అబ్బాస్ పిలుపునిచ్చారు

శనివారం వేములవాడ మహాలింగేశ్వరి గార్డెన్ లో సిపిఎం రాజన్న సిరిసిల్ల జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి

ఈ తరగతుల ప్రారంభ సూచకంగా సిపిఎం అరుణ పతాకాన్ని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ముక్తికాంత అశోక్ ఆవిష్కరించారు అనంతరం శాస్త్రీయ ఆలోచన సమాజ పరిణామ క్రమం అనే అంశంపై విజ్ఞాన దర్శిని వ్యవస్థాపక అధ్యక్షులు టి రమేష్ క్లాస్ బోధించారు రాజకీయ అర్థశాస్త్రం అనే అంశంపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి అబ్బాస్ క్లాస్ బోధించారు

సిపిఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ తరగతులకు ప్రిన్సిపాల్ గా వ్యవహరించారు అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.డి అబ్బాస్ మాట్లాడుతూ

దేశంలో మరోసారి మతోన్మాదులు అధికారంలోకి వచ్చారని తద్వారా దేశ సమైక్యత కు ప్రమాదం పొంచి ఉందన్నారు. ఉత్తర తెలంగాణలో మతోన్మాద శక్తులు గెలిచాయని గ్రామ సీమల్లో పట్టణాల్లో కుల మత ఘర్షణలను పెంచడం ద్వారా విద్వేషాలు రెచ్చగొట్టడం ద్వారా రాజకీయ లబ్ధి పొందుతున్నారని విమర్శించారు

ప్రజలు ఆకలి పేదరికం నిరుద్యోగం వంటి కీలక సమస్యల పరిష్కారం కోసం కుల మత ప్రాంత భేదం లేకుండా ఐక్యంగా కృషి చేసే పరిస్థితులు ఏర్పడాలన్నారు

రైతుల గిట్టుబాటు ధరలు వ్యవసాయ కూలీల కష్టానికి ఫలితం ,కార్మికుల కనీస వేతనాలు వంటి కీలక సమస్యలు అడుగంటి పోతున్నాయని రోజురోజుకు మతవిద్వేషాలు పెరిగిపోతున్నాయని విమర్శించారు

మను ధర్మ శాస్త్రం పేరుతో కులాల మధ్య మతాల మధ్య అసమానతలు పెంచిందన్నారు

సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసిన మ్యాజిక్ ఫిగర్ రాలేదని, చావు తప్పి కన్నులొట్ట పోయినట్లుగా సీట్లు సాధించిందన్నారు. ఎన్నికల ముందు 400 సీట్లు సాధించి రాజ్యాంగాన్ని మారుస్తామని రిజర్వేషన్లను సవరిస్తామని చెప్పిన మాటలను ప్రజలు తిరస్కరించి తగిన గుణపాఠం చెప్పారని అన్నారు గతంలో 303 సీట్లకుగాను ను 240 పరిమితం చేశారని చెప్పారు సొంతగా అధికారంలోకి రాక ఎన్డీఏ పక్షాలను కలుపుకొని నరేంద్ర మోడీ ప్రధాని పీఠాన్ని అదిరోహించాలని చూస్తున్నారని అయితే ఇది పూర్తి కాలం నిలబడే ప్రభుత్వం కాదన్నారు మిత్రపక్షాలు బిజెపి ఒంటెద్దు పోకడలను భరించలేక ఏ క్షణంలోనైనా ప్రభుత్వం నుండి వైదొలిగే అవకాశం ఉందన్నారు.

జిల్లా స్థాయిలో ఉన్న కార్యకర్తలు సామాజిక స్పృహతో మతోన్మాద చర్యలను ఎక్కడికక్కడ ఎండగడుతూ, రాజకీయంగా సామాజికంగా నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడాలని అన్నారు.

×ఈ తరగతులలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎర్రవెల్లి నాగరాజు, గన్నారం నర్సయ్య, కోడం రమణ, జవ్వాజి విమల మల్లారపు అరుణ్ కుమార్ సూరం పద్మ, గురిజాల శ్రీధర్, మల్లారపు ప్రశాంత్ గుర్రం అశోక్. రామంచ అశోక్ చిలుక. బాబు. మల్యాల నరసయ్య లింగంపల్లి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# ఆదిత్యానాథ్ దాస్ నియామకం తెలంగాణ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు : నిరంజన్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 8 :తెలంగాణ నీటి పారుదల శాఖ సలహాదారు పదవి నుంచి ఆదిత్యానాథ్ దాస్‌ను తొలగించాలని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదిత్యానాథ్ దాస్ నియామకం తెలంగాణ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు అని పేర్కొన్నారు. చంద్రబాబు ఆదేశిస్తున్నాడు.. శిష్యుడు రేవంత్ పాటిస్తున్నాడని తెలిపారు.

ప్రమాణ స్వీకారానికి ముందే తెలంగాణపై చంద్రబాబు పెత్తనం మొదలైందనడానికి ఈ నియామకమే నిదర్శనం అని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసిన తెలంగాణకు రుణపడి ఉంటాడా? పదవిని లాగేస్తారన్న భయంతో చంద్రబాబు ఆదేశాల మేరకు నడుచుకుంటాడా? నాడు జలయజ్ఞం ప్రాజెక్టుల నుండి నిన్న పాలమూరు రంగారెడ్డిపై కేసులు వేసి పనులు ఆపిన వ్యవహారంలో ఆదిత్యాదాస్‌ది కీలకపాత్ర. ఏపీ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శిగా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన వ్యక్తికి తెలంగాణ నీటి పారుదల శాఖ సలహాదారు పదవి ఎందుకు కట్టబెట్టారో ప్రభుత్వం ప్రజలకు వివరణ ఇవ్వాలి. తెలంగాణ ప్రాజెక్టుల వ్యతిరేకిగా ముద్రపడ్డ వ్యక్తిని ఏ ప్రయోజనాల కోసం ఈ పదవిలో కూర్చోబెట్టారు అని నిరంజన్ రెడ్డి అడిగారు.

వ్యక్తిగతంగా ఒక ప్రభుత్వ అధికారిగా ఆయన పట్ల మాకు ఎలాంటి వ్యతిరేకత లేదు. కానీ ఆంధ్రకు కృష్ణా ప్రాజెక్టుల నుండి నీటిని తరలించడంలో ఆయనది కీలకపాత్ర. తెలంగాణ ఏర్పడినప్పటి నుండి గత పదేళ్లుగా ఆయన ఏపీ తరపున కొట్లాడిన వ్యక్తి ఆయన తెలంగాణకు న్యాయం చేస్తాడా? కేఆర్ఎంబీలో తెలంగాణ వాదనను తొక్కిపెట్టి ప్రాజెక్టుల మీద హక్కులు కోల్పోయేలా చేసిన వ్యక్తిని నియమించడం వెనక కాంగ్రెస్ ఆలోచన ఏంటి..? పోతిరెడ్డిపాడు, దుమ్ముగూడెం, రాయలసీమ ఎత్తిపోతల పథకాలతో తెలంగాణ నీటిని తరలించడంలోనూ ఆదిత్యాదాస్‌దే కీలకపాత్ర.. అలాంటి వ్యక్తి తెలంగాణ ప్రయోజనాల కోసం కృషిచేస్తాడా? తెలంగాణ ప్రాజెక్టులు, జల వనరుల మీద అపారమైన అనుభవం, అవగాహన ఉన్న ఎందరో జల నిపుణులు ఉన్నారు వారిని పక్కనపెట్టి తెలంగాణకు వ్యతిరేకంగా పనిచేసిన వ్యక్తిని ఎంచుకోవడం వెనక కారణాలేంటి.. కాంగ్రెస్ పాలనలో పాలమూరు మరోసారి ఎడారి అయ్యేలా ఉంది అని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

# రామోజీరావుకు నివాళులర్పించి.. కుటుంబ సభ్యులను ఓదార్చిన చిరంజీవి

హైదరాబాద్, జూన్ 8 :ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు పార్థివదేహానికి టాలీవుడ్ మెగాస్టార్, పద్మవిభూషణ్ చిరంజీవి నివాళులర్పించారు. మీడియా సంస్థల అధినేత భౌతికకాయం వద్ద పుష్పగుచ్చం ఉంచి అంజలి ఘటించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు.

అనంతరం చిరంజీవి మీడియాతో మాట్లాడారు. రామోజీరావు మరణం తెలుగు రాష్ట్రాలకు తీరని లోటన్నారు. ఆయన మరణంతో తెలుగు జాతి ఓ పెద్దదిక్కును కోల్పోయిందన్నారు. రామోజీరావు కలలను, ఆశయాలను కుటుంబ సభ్యులు ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ప్రజారాజ్యం స్థాపించే సమయంలో ఆయన సలహాలు, సూచనల కోసం కలిసేవాడినని గుర్తు చేసుకున్నారు.

# మహిళా ప్రొఫెసర్‌కు లైంగిక వేధింపులు.. సీబీఐటీలో ఉద్యోగుల ఆందోళన

న్యూఢిల్లీ, జూన్ 8 : సీబీఐటీలో ఎఖింఅ డైరెక్టర్లకు వ్యతిరేకంగా ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. ఎఖింఅ డైరెక్టర్లుగా ఉన్న సుశాంత్‌బాబు, త్రివిక్రమ్ గత కొంతకాలంగా మహిళా ప్రొఫెసర్లను లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నారు. దీనిపై ఓ మహిళా ప్రొఫెసర్ కాలేజీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లింది. కానీ యాజమాన్యం పెద్దగా పట్టించుకోలేదు. పైగా ఇలాంటి ఘటనలు సర్వసాధారణమని ప్రిన్సిపల్ నర్సింహులు కొట్టిపారేశారు.

ప్రిన్సిపల్ వైఖరితో కంగుతిన్న ఆ మహిళా ప్రొఫెసర్ తన సహోద్యోగులకు జరిగిన విషయాన్ని చెప్పి కన్నీటి పర్యంతమైంది. దీంతో బోధన, బోధనేతర సిబ్బంది మొత్తం ఏకమై ఎఖింఅ డైరెక్టర్లు, ప్రిన్సిపల్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. మహిళా ప్రొఫెసర్‌కు న్యాయం చేయాలని, ఎఖింఅ డైరెక్టర్లు సుశాంత్ బాబు త్రివిక్రమ్ రావులను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కాగా, ప్రిన్సిపల్ వెళ్లకుండా అడ్డంగా పడుకుని బోధనేతర ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు సంజీవ్ నిరసన చేపట్టారు. ఈ క్రమంలో సంజీవ్ పై నుంచి ప్రిన్సిపల్ నర్సింహులు బయటకు వెళ్లిపోయారు. దీంతో ఆందోళన ఉధృతం చేస్తామని బోధన, బోధనేతర సిబ్బంది స్పష్టం చేశారు.

# ఎందుకు ఓడిపోయామో తెలియడం లేదు : వైసీపీ మాజీ ఎంపీ

అమరావతి, జూన్ 8 :ఏపీలో వైసీపీ ఓటమికి గల కారణాలను తెలుసుకోవడానికి ఆ పార్టీకి చెందిన మాజీలు అన్వేషణలో పడ్డారు. ఫలితాలు వెలువడి ఐదు రోజులు కావస్తున్న జరిగిన పొరపాటును సవరించు కోవడానికైనా తమకు ఏం చేయాలో అర్థం కావడం లేదని వాపోతున్నారు. రాజమహేంద్రవరం మాజీ పార్లమెంట్ సభ్యుడు మార్గాని భరత్(ఈనీతీఎవతీ ఓఖ ఃష్ట్రజీతీజీబీ) మీడియా సమావేశంలో మాట్లాడారు.

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ (జూ ఏజీణజీని) చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూస్తే జగన్‌ను మరోసారి పెద్ద ఎత్తున ఆశీర్వదిస్తారని అనుకున్నాం . గడపగడపకు తిరిగిన సమయంలో ప్రజల ఆదరణను చూస్తే వైసీపీ కి భారీ మెజార్టి వస్తుందని భావించాం. కాని అనూహ్యంగా ఓడిపోయాం. ఏం జరిగిందో ఇంకా అంతుచిక్కడం లేదని పేర్కొన్నారు. ప్రజలకు ఏం తక్కువ చేశామని ఓడిపోయాం.

జరిగిన తప్పులను సవరించుకోవడానికైనా లోపాలు అంతుపట్టడం లేదని అన్నారు. తమ సొంత వ్యాపారాలు పక్కనపెట్టి, ప్రజలకే జీవితాన్ని అంకితం అన్న విధంగా గడిచిన 5 సంవత్సరాల్లో అనేక కార్యక్రమాలు చేపట్టానని తెలిపారు. సొంత పనులకు ప్రాధాన్యత ఇవ్వలేదని, కుటుంబాలను, వ్యక్తిగత పనులను పక్కనపెట్టి, అభివృద్ధి చేయాలనే తపనతో పనిచేశామని వెల్లడించారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు రామోజీ అలుపెరుగని కృషి : జస్టిస్ ఎన్వీ రమణ

హైదరాబాద్, జూన్ 8 :ఈనాడు, ఉషాకిరణ్ సంస్థల అధిపతి రామోజీరావు అస్తమయం పట్ల భారత ప్రధాన మాజీ న్యాయమూర్తి , జస్టిస్ ఎన్వీ రమణ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రామోజీరావు ప్రజాస్వామ్య పరి రక్షణ కోసం, ప్రజల కోసం అలుపెరుగని యోధుడిలా పనిచేసిన పోరాట యోధుడని కొనియాడారు.నేడు ప్రజాస్వామ్య విజయాన్ని చూసి, ఆనందించి, స్వర్గస్తులయ్యారని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా రామోజీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు ప్రజా జీవితంలో రామోజీ వ్యవస్థలు భాగస్వామ్యమయ్యాయని వెల్లడించారు. ఆయన మరణం విచారకరమని అన్నారు.

# ఒడిశాలో ఎమ్మెల్యేగా ఎన్నికైన తొలి ముస్లిం మహిళగా ఫిర్దౌస్ రికార్డు.. ఆమె ఎవరిపై గెలిచారంటే..!

న్యూఢిల్లీ, జూన్ 8 :ఒడిశా అసెంబ్లీ ఎన్నికల చరిత్రలో ఇంతవరకు ఒక ముస్లిం మహిళ ఎమ్మెల్యేగా ఎన్నిక కాలేదు. కానీ ఇటీవల జరిగిన ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో ఒక ముస్లిం మహిళ ఎమ్మెల్యేగా గెలిచి రికార్డు సృష్టించారు. ఆమెనే సోఫియా ఫిర్దౌస్. 32 ఏళ్ల సోఫియా కాంగ్రెస్ అభ్యర్థిగా బారాబతి-కటక్ అసెంబ్లీ స్థానం నుంచి బరిలో దిగారు.

ఈ ఎన్నికల్లో ఆమె తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి పూర్ణచంద్ర మహాపాత్రను ఎనిమిది వేల ఓట్ల మెజార్టీతో ఓడించారు. ఈ కొత్త ఎమ్మెల్యే సోఫియాకు ఆసక్తికర నేపథ్యం ఉన్నది. ఆమె ఒడిశా సీనియర్ కాంగ్రెస్ నేత మహమ్మద్ మోకిమ్ కుమార్తె. తండ్రిపై అవినీతి ఆరోపణలు ఉండటంతో ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆమెపై అనర్హత వేటుపడింది. దాంతో ఆయన స్థానంలో కూతురు ఫిర్దౌస్ ఎన్నికల్లో పోటీ చేశారు.

అయితే తండ్రి అవినీతి మరక ఈ యువ నాయకురాలు గెలుపును ఆపలేకపోయింది. అంతేకాదు ఒడిశాలో ఎమ్మెల్యేగా ఎన్నికైన తొలి ముస్లిం మహిళగా ఆమె విజయం ఒడిశా రాజకీయ చరిత్ర పుటల్లోకి ఎక్కింది. ఫిర్దౌస్ కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ నుంచి సివిల్ ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తిచేశారు. ఆ తర్వాత 2022లో బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎంబీ) నుంచి ఎగ్జిక్యూటివ్ జనరల్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌ను కూడా పూర్తి చేశారు.

2023లో కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఆర్ఈడీఏఐ) అధ్యక్షురాలిగా ఫిర్దౌస్ ఎన్నికయ్యారు. అలాగే సీఆర్ఈడీఏఐ మహిళా విభాగానికి ఈస్ట్ జోన్ కో ఆర్డినేటర్‌గా కూడా పనిచేశారు. ఆ తర్వాత ఆమె ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ) కు కో చైర్మన్‌గా పని చేశారు. అంతేగాదు మహిళా పారిశ్రామికవేత్తలకు సంబంధించిన ఐఎన్‌డబ్ల్యూఈసీ సభ్యురాలిగా కూడా బాధ్యతలు నిర్వహించారు.

ఫిర్దౌస్ ప్రముఖ పారిశ్రామికవేత్త షేక్ మెరాజ్ ఉల్ హక్‌ను వివాహం చేసుకున్నారు. రాజకీయాల్లో ఒడిశా తొలి మహిళా ముఖ్యమంత్రి నందిని సత్పతి తనకు ఆదర్శమని ఆమె చెబుతోంది. విశేషం ఏమిటంటే 1972లో బారామతి-కటక్ నియోజకవర్గం నుంచే నందిని సత్పతి గెలుపొందారు. కాగా 2024 ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో గణనీయమైన రాజకీయ మార్పు కనిపించింది.

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మొత్తం 147 సీట్లలో 78 స్థానాలను గెలుచుకుంది. దాంతో 24 ఏళ్లపాటు ఏకధాటిగా పాలించిన బిజూ జనతాదళ్ (బీజేడీ) పార్టీ చీఫ్ నవీన్ పట్నాయక్ పాలనకు తెరపడింది.

# వర్షం తర్వాత రోడ్డుపైనున్న నీటిలో పరుపుపై తేలియాడిన వ్యక్తి..

ముంబై, జూన్ 8 : భారీ వర్షం తర్వాత రోడ్డుపై నీరు నిలిచింది. దీంతో ఒక వ్యక్తి పరుపుపై ఆ నీటిలో తేలియాడాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మహారాష్ట్రలోని పూణేలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం పూణేలో భారీ వర్షం కురిసింది. నీటితో నిండిన రోడ్డుపై ఒక వ్యక్తి పరుపుపై తేలుతూ వెళ్లాడు. కొన్ని వాహనాలు కూడా దాని పక్కగా వెళ్లాయి.

కాగా, ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీనిపై నెటిజన్లు భిన్నంగా స్పందించారు. పలువురు ఫన్నీగా కామెంట్ చేశారు. పర్యావరణానికి మేలు చేసే రవాణా అని కొందరు, విభిన్న రైడ్ అని మరి కొందరు వ్యాఖ్యానించారు. మ్యాజిక్ పరుపు అని ఒకరు, అతడు బాగా ఎంజాయ్ చేశాడని మరొకరు కామెంట్ చేశాడు.

# ముగ్గురు అంతర్ రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల ముఠా అరెస్టు..



వరంగల్, జూన్ 8:భారీ స్థాయిలో స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురు అంతర్‌రాష్ట్ర గంజాయి స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్, దామెర పోలీసులు సంయుక్తంగా కల్సి (శనివారం) అరెస్టు చేసారు. వీరి నుండి సుమారు 50 లక్షల విలువ గల 192 కిలోల గంజాయితో పాటు ఒక కారు మూడు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గాజీ సహదేవ్ (29), జై యోగేశ్వర్ (27), సోమనాదత్ రాందాన్ కలాటి (24)లను పోలీసులు అరెస్టు చేశారు. కాగా, మరో ముగ్గురు నిందితులు పాండు, లక్ష్మి తాటే, వికాస్ తాటే పరారీలో ఉన్నారు.

ఈ అరెస్టుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వివరాలను వెల్లడిస్తూ? నిందితుడు గజ్జి సహదేవ్ కారుడ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తూ సులభంగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంగా గత కొద్ది రోజులుగా ఆంధ్రప్రదేశ్‌లోని చింతూరు మండలం, తునగొండ గ్రామ పరిసరాల నుండి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు రహస్యంగా తరలించి గంజాయిని ఎక్కువ ధరకు విక్రయించేవారు. ఇదే తరహాలో గజ్జి సహదేవ్ తో సహా మిగిలిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

# గొంతులో సమస్యతో చిరాకుగా ఉందా.. అయితే ఈ వంటింటి చిట్కా మీ కోసమే..!



హైదరాబాద్, జూన్ 8 : గొంతులో సమస్య చాలా చిరాకు తెప్పిస్తుంది. ప్రతి ఒక్కరికి ఏదో ఒక సమయంలో ఈ సమస్య ఎదురవుతూనే ఉంటుంది. గొంతులో గరగర, భరించలేని గొంతు నొప్పి, గొంతులో మంట లాంటి సమస్యలు మనలను కుదురుగా ఉండనివ్వవు. ఈ గొంతు సంబంధ బాధను మాటల్లో వర్ణించలేం. ఏది తిన్నా రుచించదు. గొంతు నొప్పిగా ఉన్నప్పుడైతే మంచినీళ్లు మింగబోయినా ప్రాణం పోయినంత బాధ కలుగుతుంది.

కొంతమందికి చల్లటి నీళ్లు తాగినప్పుడు లేదంటే ఏదైనా చల్లటి పదార్థం తిన్నప్పుడు గొంతు సమస్యలు వస్తాయి. కొందరికి చల్లటి పదార్థాలతో పెద్దగా సమస్యలు రాకపోయినా పానీపూరి, బజ్జీలు, మిర్చీలు లాంటి బయటి ఫుడ్స్ తిన్నప్పుడు గొంతులో ఇన్‌ఫెక్షన్ వస్తుంది. ఇలా గొంతుకు సంబంధించిన ఏ చిన్న సమస్య వచ్చినా తక్షణమే ఉపశమనం కలిగించే వంటింటి చిట్కా ఒకటి ఉంది. మరి ఆ చిట్కా ఏంటో తెలుసుకుందామా..?

గొంతులో సమస్య ఉన్నప్పుడు ఒక పాత్రలో పావు లీటర్ నీళ్లు పోసి దాన్ని పొయ్యిమీద పెట్టాలి. ఆ నీళ్లలో చిన్న అల్లం ముక్క, రెండు యాలకులు, ఓ పదీ పన్నెండు తులసి ఆకులు, పావు స్పూన్ పసుపు వేసి బాగా మరిగించాలి. ఆ మరిగించిన నీటిని వడకట్టి తీయదనం కోసం ఒక స్పూన్ తేనె కలుపుకుని తాగాలి. అయితే మధుమేహం ఉన్నవాళ్లు మాత్రం తేనె కలుపకూడదు. ఈ చిట్కా గనుక పాటిస్తే క్షణాల్లోనే మీ సమస్య పరిష్కారమవుతుంది. తక్షణమే ఉపశమనం లభిస్తుంది.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas.
**RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com